TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక




## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 146 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | మంగళవారం 21 జూలై 2026 | వెల : 4/-



## తొలి రోజే దుమారం

- నీట్, అయోధ్యలో విరాళాల చోరీ, విద్యార్థుల నిరసనలపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళనలు
- పలుమార్లు వాయిదాపడిన ఉభయ సభలు
- 'ఇండియా'కూటమి నేతల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఉభయసభలు హోరెత్తిపోయాయి
- తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ కు విపక్షాలు పట్టుబట్టాయి


## క్యూఆర్ కోడ్‌తో
# స్మార్ట్ రేషన్

- 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- వారం రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠ భద్రతా ఫీచర్లతో కొత్త కార్డుల రూపకల్పన
- ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ
- రేషన్ సరుకులకు జులై 31 లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి




హైదరాబాద్

తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం - మిగతా3లో



## ఆపదలో అండగా...
# ఆర్టీసీ ఒకే కుటుంబం!

- కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి రూ. 90.85 లక్షల ఆర్థిక సాయం అందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.
- గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారు

హైదరాబాద్

టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని... వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు 'చేయూత' కార్యక్రమం ద్వారా - మిగతా3లో




## కోరలు చాస్తున్న పేదరికం

- పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం..
- పాకిస్థాన్‌లో ప్రమాదకర స్థాయికి చేరిన పేదరికం
- గడిచిన ఆరేళ్లలో 21.8శాతం నుంచి 28.9శాతానికి పెరిగిన వైనం
- పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువ ప్రభావం

# 'అపార్' తల్లిదండ్రుల ఇష్టం

- సమ్మతి పత్రంలో ఆప్ట్-అవుట్ ఆప్షన్ ఉండాల్సిందే
- ఆ మేరకు సవరణలు చేపట్టాలి
- సీబీఎస్ఈకి ఆదేశాలు జారీ చేస్తామన్న సుప్రీంకోర్టు
- దేశవ్యాప్తంగా ఒడిశా హైకోర్టు తీర్పు అమలుకు నిర్ణయం





## డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయి

- కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

## తెలంగాణలో భూసేకరణకు
# ప్రత్యేక చట్టం

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు!
- రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ పూలింగ్ చట్టానికి ప్రభుత్వం కసరత్తు
- భూమి కోల్పోయే రైతులకు అభివృద్ధి చేసిన స్థలాలు
- ముసాయిదా బిల్లుకు తుది రూపు



హైదరాబాద్

తెలంగాణలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకొచ్చేందుకు అధికార యంత్రాంగం వేగంగా కసరత్తు ప్రారంభించింది. తెలంగాణ కాంప్రహెన్సివ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లానింగ్ బిల్లు-2026 ప్రాథమిక ముసాయిదా సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ బిల్లులో ఏమేం అంశాలు ఉండాలో సీఎస్ సంజయ్‌జాజు పురపాలక, రోడ్లు-భవనాలు, ఇరిగేషన్, రవాణా తదితర శాఖలు, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో గురు, శుక్రవారాల్లో సెక్రేటరియట్‌లో చర్చలు చేశారు. ఈ ముసాయిదా బిల్లుకు తుది రూపు ఇచ్చేందుకు అధికారుల కసరత్తు - మిగతా3లో



## అంతరిక్ష రంగంలో యువత అద్భుతాలు

- వర్షాలు బాగుండాలి
- వర్షాకాల సమావేశాలూ బాగుండాలి
- రెండూ బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభంలో మోదీ పిలుపు
- "దేశ పురోగతిలో యువత పాత్ర అత్యంత కీలకం
- వారి సామర్థ్యాలు, ఆకాంక్షలు అంతరిక్షమంత విశాలమైనవి.
- 56 ఏళ్ల యువకుని గురించి మాట్లాడట్లేదు
- రాహుల్‌కు మోదీ చురక

# ఎల్ నినోను ఎదుర్కొంటాం




- రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం
- ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి
- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది
- ఎలాంటి ప్రకృతి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలను ఆదుకుంటాం
- మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి

# ‘అపార్’ తల్లిదండ్రుల ఇష్టం

**న్యూఢిల్లీ:** పాఠశాల విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ‘అపార్’(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీల నమోదుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకానికి సమ్మతిని నిరాకరిం చేందుకు, తప్పుకునేందుకు తల్లిదండ్రులకు అవకాశం కల్పించేలా సవరణలు చేపట్టాలంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ)కి మార్గదర్శకాలు జారీ చేస్తామంది. నూతన విద్యా విధానం--2020 ప్రకారం కేంద్రం ప్రారంభించిన అపార్ పథకం కింద విద్యార్థుల కోసం ఒక ప్రత్యేకమైన, జీవితకాల 12--అంకెల ’స్టూడెంట్ ఐడీ’ రూపొందిస్తారు. ఇది విద్యార్థుల అన్ని విద్యాపరమైన రికార్డులకు ఒక డిజిటల్ పాస్‌పోర్ట్‌లా పనిచేస్తుంది. ఇందులో మార్కుల జాబితాలు, డిగ్రీ సరి?టఫికెట్లు, ఇతర విజయాల వివరాలన్నీ నిక్షిప్తమై ఉంటాయి.




**బలవంతం, రాజ్యాంగ విరుద్ధం...**

అపార్ ఐడీల నమోదు స్వచ్ఛందమేనని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆచరణలో దీనిని ఆధార్‌తో అనుసంధానించి విద్యార్థులను బలవంతం చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ వాదనలు వినిపిస్తూ.. బోర్డు పరీక్షలు రాసే విద్యార్థులకు అపార్ ఐడీని తప్పనిసరి చేస్తున్నారని తెలిపారు. పరోక్షంగా విద్యార్థులను ఆధార్ కోసం బలవంత పెడుతున్నారన్నారు. కేవలం ఆధార్, అపార్ ఐడీలు లేవన్న కారణంతో విద్యార్థులను పరీక్షలకు అనుమతించకపోవడం విద్యాహక్కు చట్టానికి, రాజ్యాంగానికి విరుద్ధమని వాదించారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం--2023 నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని తెలిపారు.

**కేంద్రం కూడా అభ్యంతరం తెలపలేదు.**

అపార్ సమ్మతి పత్రంలో ‘ఆప్ట్ --అవుట్’ఆప్షన్ స్పష్టంగా ఉండాలంటూ ఒడిశా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ధర్మాసనం ఈ సందర్భంగా సమరి?థంచింది. ఆ తీర్పుపై కేంద్ర ప్రభుత్వం కూడా అభ్యంతరం తెలపలేదని గుర్తు చేసింది. అదే తీర్పును దేశవ్యాప్తంగా అమలు చేసేలా సీబీఎస్ఈకి మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపింది. డేటా ప్రొటెక్షన్, సమ్మతి వంటి అంశాలపై అభ్యంతరాలను కూడా పరిశీలించాలని కోరుతామంది. ఈ పథకం పూర్తిగా స్వచ్ఛందంగానే ఉండాలని, సమ్మతి పత్రాల్లో తల్లిదండ్రులకు తిరస్కరించే అవకాశాన్ని తప్పనిసరిగా కల్పించాలని తేల్చిచెప్పింది. విద్యార్థుల డేటా గోప్యత, తదితర అభ్యంతరాలపై సమగ్ర పరిశీలన జరపాలని సీబీఎస్ఈని ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

**ప్రతి దాన్నీ అనుమానించొద్దు...**

దేశంలో జరిగే ప్రతీ పరిణామాన్ని అనుమానపు దృష్టితో చూడొద్దని సుప్రీంకోర్టు హితవు పలికింది. విద్యార్థుల విద్యా ప్రణాళిక, రికార్డుల నిర్వహణ కోసం ఒకే విశిష్ట గుర్తింపు తీసుకురావడం మంచి పరిణామమేనని, దీనిని స్వాగతించాలని అభిప్రాయపడింది. దేశంలో డేటా భద్రతా చట్టం అమలులో ఉందని, ఎవరూ దానిని ఉల్లంఘించడానికి వీల్లేదని వ్యాఖ్యానించింది. అయితే, సేకరించిన విద్యార్థుల డేటాను ఏ ఉద్దేశం కోసం తీసుకున్నారో, ఆ విద్యా సంబంధిత అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది.

# తొలి రోజే దుమారం

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజు సమావేశాలు విపక్షాల నినాదాల హోరులో కొట్టుకుపోయా యి. ఎలాంటి చర్చలు జరగకుండానే లోక్‌సభ, రాజ్యసభలు సోమవారం అర్ష?ధంతరంగా ముగిసి మంగళవారానికి వాయిదాపడ్డాయి. ప్రతిష్టాత్మక నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ, అయోధ్య రామ మందిరంలో కోట్ల రూపాయల విరాళాల చోరీ, జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జ్ తదితర కీలకాంశాలపై చర్చ చేపట్టాలంటూ విపక్ష పార్టీల నేతలు పట్టుబట్టడంతో పార్లమెంట్ ఉభయసభల్లో తొలిరోజే ప్రతిష్టంభన నెలకొంది. ‘ఇండియా’కూటమి నేతల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఉభయసభలు హోరెత్తిపోయాయి. తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ కు విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో లోక్‌సభలో ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ సమయం వృథాగా ఖర్చయిపో యాయి. సభాకార్యకలాపాలకు విపక్ష సభ్యులు అడ్డుతగలడంతో లోక్‌సభ, రాజ్యసభలు తలో ఆరుసార్లు వాయిదాపడ్డాయి. ఉభయ సభాపతులు ఇరుసభలను మంగళవారానికి వాయిదావేశారు.



**ఆరంభం నుంచే అట్టుడికిన లోక్‌సభ..**

ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే మరణించిన మాజీ ఎంపీలకు నివాళులు అర్పించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు వివిధ అంశాలపై చర్చ కోరుతూ వెంటనే నినాదాలు చేశారు. సభ నినాదాలతో నడవదని, సభ్యులు తమ స్థానాల్లో కూర్చొని సభా కార్యక్రమాలకు సహకరించాలని స్పీకర్ బిర్లా విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్, ఎస్పీ, ఆర్జేడీసహా పలు ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లోంచి లేచి ముందుకొచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నినాదాలతో లోక్‌సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓం బిర్లా సభ్యులను శాంతించాలని మరోమారు కోరారు. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలు కొనసాగడంతో మొదట మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదా వేశారు. అనంతరం తిరిగి ప్రారంభం అయ్యాక విపక్షాల ఆందోళన కొనసాగడంతో వాయిదాల పర్వం కొనసాగి, చివరికి సభ మంగళవారానికి వాయిదా పడింది.

**రాజ్యసభలోనూ వాయిదాల పర్వం..**


రాజ్యసభలో పత్రాల సమర్పణ, నూతన సభ్యుల ప్రమాణస్వీకారం, మృతిచెందిన సభ్యులకు సంబంధించిన సంతాప తీర్మానాల అనంతరం సభా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వెంటనే రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ అంశాన్ని ప్రస్తావించారు. “జంతర్‌మంతర్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థుల గొంతు ప్రభుత్వం నొక్కేస్తోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన సమస్యపై చర్చ జరగాల్సిందే. జంతర్‌మంతర్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ప్రభుత్వం బలప్రయోగం, లాఠీఛార్జి చేస్తోంది. వారి గొంతును అణచివేస్తోంది”అని ఖర్గే అన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై అధికార కూటమి ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదావేశారు. తర్వాత సభ మొదలైనా పరిస్థితి అలాగే కొనసాగింది. జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అయోధ్యలోని రామమందిరంలో కోట్ల రూపాయల విరాళాలను చోరీచేసిన ఉదంతంపై చర్చ జరపాలని పట్టుబట్టారు. ఈ డిమాండ్లు, నినాదాల నడుమ సభ మంగళవారానికి వాయిదా పడింది.

**లోక్‌సభ ముందుకు జడ్జీల బిల్లు..**

ఇంతటి నినాదాల హోరులోనూ ప్రభుత్వం లోక్‌సభలో ఒక బిల్లును విజయవంతంగా ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు గతంలో జారీచేసిన ఆర్డినెన్స్ స్థానంలో రూపొందించిన బిల్లును లోక్‌సభలో న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు.

# అంతరిక్ష రంగంలో యువత అద్భుతాలు

**న్యూఢిల్లీ:** ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవాలని, అదేమాదిరి వర్షాకాల సమావేశాలు ఫలప్రదంగా సాగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం సందర్భంగా సోమవారం ఆయన పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. “రెండూ బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. అప్పుడు అందరి జీవితాల్లో వెలుగులు నిండుతాయి. ఇదే ఆశతో ఈసారి వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుందాం. అదే విధంగా ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సైతం ఫలప్రదంగా సాగాలనీ కోరుకుందాం. సభలో నిర్మాణాత్మక చర్చల ద్వారా దేశ ప్రగతికి, ప్రజా సంక్షేమానికి దోహదపడాలి. రాజకీయాలకు అతీతంగా అనుభవజ్ఞులైన ఎంపీల విజ్ఞానం దేశాభివృద్ధి కోసం ఉపయోగపడాలి. బలమైన వాదనలు ఉన్నప్పుడు ప్రశాంతంగా మాట్లాడినా మన గళాన్ని సమర్థవంతంగా వినిపించవచ్చు”అని మోదీ చెప్పారు. “దేశ పురోగతిలో యువత పాత్ర అత్యంత కీలకం. వారి సామర్థ్యాలు, ఆకాంక్షలు అంతరిక్షమంత విశాలమైనవి. గడిచిన నెల రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ, అంతరిక్ష రంగాల్లో అసాధారణ మైలురాళ్లను భారత్ అధిగమించింది. భారతీయ వ్యోమగామి గత ఏడాది వర్షాకాల సమావేశాల



ముందు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. ఈసారి వర్షాకాల సమావేశాలకు ముందు భారతీయ అంకుర సంస్థ స్కైరూట్ ప్రయోగించిన విక్రమ్--1 రాకెట్ విజయవంతంగా గగనతలంలోకి వెళ్లింది. భారతీయ యువత ఆశలు, ఆశయాలకు నింగిలాగా ఎలాంటి హద్దుల్లేవనడానికి ఈ విజయమే నిదర్శనం”అని మోదీ కొనియాడారు.

**7.7 శాతం వృద్ధిరేటు...**

“పశి?చమాసియాలో యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయంగా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, ఎరువులు, రసాయనాల దిగుమతులపై తీవ్ర ప్రభావం పడినప్పటికీ భారతదేశం 7.7 శాతం వృద్ధిరేటును నమోదుచేసింది. ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవడం దేశానికున్న అపారమైన శక్తికి నిదర్శనం”అని మోదీ అన్నారు.

**56 ఏళ్ల యువకుని గురించి మాట్లాడట్లేదు**

**రాహుల్‌కు మోదీ చురక**

స్కైరూట్ సంస్థ విజయం గురించి మాట్లాడుతూ రాహుల్ గాంధీనుద్దేశిస్తూ మోదీ పరో క్షంగా వ్యంగ్య వ్యాఖ్యలుచేశారు. యువకులు ఎంతో సాధిస్తున్నారని, రాహుల్ 56 ఏళ్లు వచ్చినా పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో విఫలమయ్యారనే అర్థం ధ్వనించేలా మోదీ పరోక్షంగా చురకలంటించారు. “అంతరిక్షంలో అద్భుతం సృష్టించిన స్కైరూట్ అంకురసంస్థలోని బృంద సభ్యుల సగటు వయస్సు కేవలం 28 ఏళ్లు మాత్రమే. యువత అద్భుతాలు చేస్తోంది. నేనిక్కడ 56 ఏళ్ల యువకుడి(రాహుల్) గురించి మాట్లాడటం లేదు. 28 ఏళ్ల వయస్సున్న దేశీయ యువతే అంతరిక్షంలో భారత జెండాను ఎగరేసింది”అని మోదీ వ్యాఖ్యానించారు. ప్రైవేట్ రంగానికి కల్పించిన సంస్కరణల వల్లే సాహసోపేతమైన విజ యాలను యువత సాధిస్తోందని మోదీ అన్నారు.


## కోరలు చాస్తున్న పేదరికం




దాయాది దేశం పాకిస్థాన్‌ను పేదరికం చుట్టుముడుతోంది. గడిచిన ఆరేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో నిరుపేదల సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరిగిపోయింది. వరుస ఆర్థిక సంక్షోభాలు, అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన వృద్ధి రేటు వంటి కారణాలతో కుటుంబ ఆదాయాలు గణనీయంగా క్షీణించాయి. ఫలితంగా దేశ జనాభాలో దాదాపు 29 శాతం మంది పేదరిక రేఖకు దిగువన జీవిస్తున్నారని ఒక తాజా నివేదిక వెల్లడించింది. 2018-19లో 21.8 శాతంగా ఉన్న పేదరికం, 2024-25 నాటికి 28.9 శాతానికి చేరింది. అంటే కేవలం ఆరేళ్లలోనే పేదరికం 7 శాతం పెరిగింది. హౌస్‌హోల్డ్ ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్ సర్వే (హెచ్ఐఈఎస్), పాకిస్థాన్ సోషల్ అండ్ లివింగ్ స్టాండర్డ్స్ మెజర్‌మెంట్ (పీఎస్ఎల్ఎం) డేటా ఆధారంగా ‘డాన్’ పత్రిక ఈ విశ్లేషణను ప్రచురించింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత విడుదలైన ఈ గణాంకాలు.. దేశం ఎదుర్కొన్న బహుళ సంక్షోభాల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. గ్రామీణ పాకిస్థాన్‌లో పేదరికం సుమారు 8 శాతం మేర పెరగగా, పట్టణ ప్రాంతాల్లో ఇది 6 శాతంగా నమోదైంది. పదేపదే తలెత్తిన చెల్లింపుల సంక్షోభం, కోవిడ్-19 మహమ్మారి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, దీర్ఘకాలిక స్థూల ఆర్థిక సర్దుబాట్లు వంటివి ఈ దుస్థితికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. విశ్లేషకులు ఈ పరిస్థితిని జీవన ప్రమాణాల మెరుగుదల విషయంలో ‘కోల్పోయిన దశాబ్దం’గా అభివర్ణిస్తున్నారు. గత రెండు సర్వేల మధ్య కాలంలో ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత చూస్తే, సగటు కుటుంబ ఆదాయాలు, వినియోగం గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ఆర్థిక వృద్ధి సానుకూలంగా ఉన్నప్పటికీ, పేదరికం పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ వృద్ధి ఫలాలు ఎక్కువగా ఉన్నత ఆదాయ వర్గాలకే చేరాయని, దిగువ ఆదాయ వర్గాల వాస్తవ ఆదాయాలు, కొనుగోలు శక్తి తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇది సూచిస్తోంది.

పేద కుటుంబాలు ఎక్కువగా రోజువారీ వేతనాలపై ఆధారపడతాయి. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అంతరాయాల వల్ల ఈ వర్గాలే ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు, సంపన్న వర్గాలు రియల్ ఎస్టేట్, ఆర్థిక పెట్టుబడుల వంటి ఆస్తులను కలిగి ఉండటంతో, ధరల పెరుగుదల ప్రభావాన్ని తట్టుకోగలిగారు. దీంతో దేశంలో ఆదాయ అసమానతలు మరింత పెరిగాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, బాహ్య ఆర్థికపరమైన రిస్కుల మధ్య, పెరుగుతున్న పేదరికాన్ని, విస్తరిస్తున్న అసమానతలను పరిష్కరిస్తూనే ఆర్థిక వృద్ధిని కొనసాగించడం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారింది.

## డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయి



నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఢిల్లీలో నిరసనలు ఉద్ధృతమయ్యాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా ఢిల్లీలోని నడ్డా నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు సమావేశమై, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సమస్యపై అంతర్గతంగా ఉన్నత స్థాయిలో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అయితే ఎటువంటి నిర్దిష్ట హామీలు లభించలేదని సౌరవ్ దాస్ ‘ఎక్స్’ వేదికగా వెల్లడించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజే సీజేపీ ‘పార్లమెంట్ ముట్టడి’కి పిలుపునివ్వడంతో జంతర్ మంతర్ వద్దకు విద్యార్థులు, యువత భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పటికీ ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కొన్నిచోట్ల లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువును ప్రయోగించారు. సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా ఆరంభమైన కాక్రోచ్ జనతా పార్టీ, ప్రస్తుతం పరీక్షల లీకేజీలు, సాంకేతిక వైఫల్యాలపై నిరంతరాయంగా పోరాడుతోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనలు ప్రారంభమైన తర్వాత సీజేపీ నేతలతో కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చలు జరపడం ఇదే ప్రథమం. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని సీజేపీ నాయకత్వం తేల్చిచెప్పింది.

## జగన్నాథుడి ఆభరణాల లెక్కింపు పూర్తి!

పూరి: ఒడిశా పవిత్ర పుణ్యక్షేత్రం పూరి జగన్నాథుడి ఆభరణాల భాండాగారం రత్నభాండార్ ప్రత్యేక లెక్కింపు పూర్తయినట్లు అధికారులు ప్రకటించారు. అంతర్జాతీయ ప్రఖ్యాత పూరి జగన్నాథ యాత్ర ముగిసి జగన్నాథ, బలభద్రులు ఇద్దరు గుండిచ దేవస్థానంలోకి ప్రవేశించిన తరువాత ఈ ప్రత్యేక పరిశీలన నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ఒడిశా ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. దేవాలయంలోని వేర్వేరు పండుగల నేపథ్యంలో రత్నభాండార్ ప్రత్యేక పరిశీలన కార్యక్రమాన్ని మే నెల 23వ తేదీన నిలిపివేసిన విషయం తెలిసిందే. గత నెలలో స్నాన పూర్ణిమ సందర్భంగా ఉత్సవమూర్తుల నుంచి తొలగించిన ఆభరణాల లెక్కింపు, బరువు తూచడం వంటివి చేశారు. ‘రాహు రేఖ’, బంగారు ‘చితా’, వెండి ‘రసిక’ఆభరణాలతోపాటు విగ్రహాలకు సంబంధించిన ఇతర ఆభరణాలను కూడా లెక్కించామని, శ్రీ జగన్నాథ్ దేవాలయ అడ్మినిస్ట్రేషన్ ప్రధాన అడ్మినిస్ట్రేటర్ అరబింద పాఢే తెలిపారు. “డిజిటల్ డాక్యుమెంటేషన్‌లో భాగంగా లెక్కింపు, బరువు తూచే ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీశాం”అని ఆయన తెలిపారు. ఆభరణాల్లోని రత్నాలు, ఇతర విలువైన రాళ్లను నిపుణులు పరిశీలించారని, తెలిపారు. ప్రభుత్వం ఆమోదించిన ప్రామాణిక ప్రక్రియకు అనుగుణంగా లెక్కింపు ప్రక్రియ పూర్తిచేసినట్లు రత్నభాండార్ పరిశీలన కమిటీ అధ్యక్షులు జస్టిస్ (రిటైర్డ్) బిశ్వనాథ్ రథ్ తెలిపారు. దేవాలయానికి సంబంధించి రెండు రత్నభాండార్‌లు ఉంటే అందులోని బయటి భండాగారం లెక్కింపు ప్రక్రియ ప్రస్తుతం పూర్తవగా లోపలి దాని లెక్కింపు కొనసాగుతున్నట్లు మరో అధికారి తెలిపారు.

# ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్..

### 11బైకులు స్వాధీనం..మరో రిసీవర్ కోసం గాలింపు

**హైదరాబాద్ సిటీ,జులై20(సూర్యరేఖ)** నగరంలో వరుస ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఓ అంతర్రాష్ట్ర దొంగను నేరేడ్మెట్ పోలీసులు అరెస్టు చేసి,అతని వద్ద నుంచి 11ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసుల కథనం ప్రకారం..నిందితుడు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ పరిధుల్లో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నాడు.ఇటీవల నమోదైన వాహన చోరీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించిన నేరేడ్మెట్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు.అనంతరం ప్రత్యేక బృందం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఇప్పటివరకు మొత్తం 14ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.నిందితుడి వద్ద నుంచి 11బైకులను స్వాధీనం చేసుకోగా, మిగిలిన వాహనాల కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ కేసులో చోరీ చేసిన వాహనాలను కొనుగోలు చేసిన ఒక రిసీవర్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు.మరో రిసీవర్ పరారీలో ఉండగా,అతడిని త్వరలోనే అరెస్టు చేస్తామని అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ మాట్లాడుతూ...సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగానే ఈ కేసును ఛేదించడం సాధ్యమైందని తెలిపారు.నేరాల నియంత్రణ,ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంటూ, ప్రతి ఇంటి వద్ద,అపార్ట్‌మెంట్లు,కాలనీలు,వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.అలాగే,ద్విచక్ర వాహన యజమానులు తమ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో వాహనం చోరీకి గురైన సందర్భంలో త్వరితగతిన గుర్తించి స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కేసును



సమర్ధవంతంగా ఛేదించిన నేరేడ్మెట్ సీఐ,క్రైమ్ ఎస్సై చంద్రశేఖర్ మరియు వారి బృందాన్ని మల్కాజిగిరి డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.వారి ప్రతిభను గుర్తిస్తూ రివార్డులు అందజేసి సత్కరించారు. "సీసీ కెమెరాలే నేర నియంత్రణకు కీలకం..ప్రజలు భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి"అని డీసీపీ విజ్ఞప్తి చేశారు.

# గగన్ పహాడ్ లోని చెరువులను సంరక్షించాలి..





### హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కోరిన శీలం తిరుపతిరెడ్డి

**రాజేంద్రనగర్,జులై20(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో చెరువులు,కుంటలు,ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాయకులు శీలం తిరుపతి రెడ్డి అన్నారు.స్థానికంగా చెరువులు,కుంటలు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపడితే రాబోయే విపత్తులను ఎవరూ నిలువరించలేరని వ్యాఖ్యానించారు. రాజేంద్రనగర్ పరిధిలోని గగన్ పహాడ్ పరిధిలోని ప్రెస్టీజ్ ప్రాంతం పెద్ద చెరువు(98.50 ఎకరాలు),మామిడికుంట చెరువు (19.50 ఎకరాలు),అప్పా చెరువు (40 ఎకరాలు),బ్రాహ్మణ చెరువులలో జరుగుతున్న ఆక్రమణలు ,అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సోమవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను శీలం తిరుపతిరెడ్డి కోరారు.ఈ మేరకు హైడ్రా కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా చెరువు అన్యాక్రాంతం అవుతున్న విధానాన్ని కమిషనర్‌కు వివరించారు.అనంతరం శీలం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ను కలిసి గగన్‌పహాడ్ పరిధిలోని ప్రెస్టీజ్ ప్రాంతంలోని పెద్ద చెరువు (98.50 ఎకరాలు),అలాగే గత మేలో సమర్పించిన ఫిర్యాదు నెంబర్ 2579పై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి ఆక్రమణలను తొలగించి,చెరువులను పూర్తిస్థాయిలో పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని కోరారు.హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించడంతో తక్షణమే చర్యలు తీసుకుంటామని రంగనాధ్ వారికి హామీ ఇచ్చారన్నారు.

## ఎల్ నినోను ఎదుర్కొంటాం

**హైదరాబాద్:** ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని, రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ లోని ఉద్యాదిత్య భవన్ లో నల్లగొండ, సూర్యపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులతో ఎల్ నినో సంసిద్ధత, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై సోమవారం (జూలై 20) ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. నీటి లభ్యతను బట్టి రైతులు కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా, లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలు వేసేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాకు సాగునీరు అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గం పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వెల్లడించారు. ఈ సొరంగం పనులను వేగవంతం చేయడానికి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఎలాంటి ప్రకృతి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలను ఆదుకుంటామని మంత్రులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు రాష్ట్ర ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్, నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో భూసేకరణకు ప్రత్యేక చట్టం

-మొదటిపేజీ తరువాయి

సాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ల్యాండ్ పూలింగ్ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలు మెరుగ్గా ఉన్నాయని గుర్తించినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యే ప్రత్యేక ల్యాండ్ పూలింగ్?కు సంబంధించి ఎటువంటి చట్టం లేదు. అందుకు అనుగుణంగా కొత్త చట్టాన్ని రూపొందించే దిశగా ప్రభుత్వం ముమ్మరంగా అడుగులు వేస్తోంది.

**అటు యజమానులకు, ఇటు ప్రభుత్వానికి లాభం**

రాష్ట్రంలో నేషనల్ హైవేలు, రైల్వే లైన్లు, రీజినల్ రింగ్ రోడ్, పారిశ్రామిక కారిడార్లు, ఇండస్ట్రియల్ పార్కులు, టౌన్‌షిప్‌లు, ప్రతిపాదిత హైస్పీడ్ రైలు మార్గాలు, విమానాశ్రయాల విస్తరణ, సాగునీటి ప్రాజెక్టులు వంటి అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు భారీగా భూములు అవసరం అవుతున్నాయి. ప్రస్తుతం ఏదైనా ప్రాజెక్టుకు భూసేకరణ ప్రారంభించగానే తమ భూములు పోతాయనే భయంలో రైతులు ఉంటున్నారు. నిరసన బాట పడుతున్నారు. ఈక్రమంలో ప్రాజెక్టులతో అందరికీ సమానంగా ప్రయోజనం చేకూరే విధానాన్ని రూపొందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ల్యాండ్ పూలింగ్ అధ్యయనం టీంలోని ఒక ఉన్నతాధికారి తెలిపారు.

పూలింగ్‌లో తీసుకున్న భూముల్లో మౌలిక వసతుల ఏర్పాటు అనంతరం కొంత భాగాన్ని ప్లాట్ల రూపంలో తిరిగి భూయజమానులకు కేటాయించే విధానంపై అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో భారీ సాగునీటి ప్రాజెక్టులు చిన్నచిన్న భూసమస్యల కారణంగా జాప్యానికి గురవుతున్న నేపథ్యంలో ఇరిగేషన్ శాఖను కూడా ఈ ప్రక్రియలో ప్రభుత్వం పాల్గొనేలా చేసింది.

**త్వరలో ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ**

ల్యాండ్ పూలింగ్ ముసాయిదా బిల్లు ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్నట్లు సమాచారం. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు, కొత్త విధానానికి తుదిరూపు ఇచ్చేందుకు వివిధ శాఖల ఉన్నతాధికారులతో త్వరలోనే ప్రత్యేక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుందని తెలుస్తోంది. ఆ కమిటీ సిఫారసుల ఆధారంగా బిల్లుకు తుది రూపం ఇవ్వనున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. భూసేకరణకు చట్టబద్ధ ప్రత్యామ్నాయాన్ని తీసుకురావడం, రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటేడ్ విధానం వంటి ప్రయోజనాలు ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది.

**ఉప్పల్ భగాయత్ మోడల్, రాష్ట్రవ్యాప్త చట్టబద్ధం**

గతంలో హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్?మెంట్ అథారిటీ భూయజమానుల భాగస్వామ్యంతో ల్యాండ్ పూలింగ్‌ను చేపట్టింది. అందులో కొంత భూమిని మెట్రో రైలు ప్రాజెక్టుకు, ఇతర అవసరాలకు వినియోగించింది. మిగిలిన దాంట్లో కొంత భూమి యజమానులకు అభివృద్ధి చేసిన ప్లాట్ల రూపంలో అందజేసింది. ఈక్రమంలో ఇక్కడ ల్యాండ్ పూలింగ్‌లో అనుభవమున్న హెచ్ఎండీఏలోని ఓ ఉన్నతాధికారికి బిల్లు రూపకల్పనలో కీలక బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

## పుష్ప తరహాలో అక్రమ కలప రవాణా...

### అధికారులు తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేసిన స్మగ్లర్లలో మారని బుద్ధి..

### కోర్టు విధించే శిక్షలు బలమైనవి లేకపోవడంతోనే ఈ ఆక్రమాలు పునరవృత్తమవుతున్నాయని ఆరోపణాలు..

### ఇలాంటి వారికి నాన్ బేలేబుల్ కేసులే విధించాలని జంతువు,అటవీ ప్రేమికుల ఆవేదన

### ఇప్పుడు దేవునిగూడెం నుండి జగిత్యాల జిల్లాకు

### అక్రమ కలప రవాణా చేస్తూ భారీ మొత్తంలో కలప స్వాధీనం..










**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జూలై20(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందన్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలోని కలమడుగు చెక్‌పోస్ట్ వద్ద సోమవారం అటవీశాఖ అధికారులు నిర్వహించిన తనిఖీలలో టీఎస్19 టీ 3770నంబర్ గల అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ అక్రమంగా టేకు దూలాలు,టేకు ఫర్నిచర్ మరియు టేకు దుంగలను ఎలాంటి చెల్లుబాటు అయ్యే అటవీ రవాణా అనుమతి (ట్రాన్సట్ పెర్మిషన్)లేకుండా తరలిస్తుండగ సోమవారం ఇందన్ పెల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ తమ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు.వాహనంతో పాటు అక్రమంగా రవాణా చేస్తున్న టేకు అటవీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకొని సంబంధిత అటవీ చట్టాల ప్రకారం అటవీ నేర కేసు నమోదు చేయడం జరిగింది అని ఆయన తెలిపారు.ఈ అక్రమ రవాణాకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగుతోంది.ఈ తనిఖీ కార్యక్రమంలో మధుకర్ (ఎఫ్ఎస్ఓ), పోచయ్య (ఎఫ్ బిఓ),తన్వీర్ (ఎఫ్ బిఓ)మరియు బేస్ క్యాంప్ వాచర్లు పాల్గొని విజయవంతంగా ఈ అక్రమ రవాణాను అడ్డుకున్నారు.ఈ సందర్భంగా ఇందన్‌పల్లి అటవీ రేంజ్ అధికారి జి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ...అటవీ సంపదను అక్రమంగా నరికివేయడం,రవాణా చేయడం వంటి చర్యలపై అటవీశాఖ నిరంతరం కఠిన నిఘా ఉంచిందని తెలిపారు.అటవీ నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు కూడా అటవీ సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని,అక్రమ కలప రవాణా గురించి సమాచారం ఉంటే వెంటనే అటవీ శాఖకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

**కేసులు నమోదు చేసిన అక్రమార్కులలో మారని బుద్ధి:**


వారం రోజుల క్రితం కవ్వాల్ టైగర్ జోన్ దేవుని గూడ గ్రామంలో కట్ట కోత మిషన్ తో పాటు మోటారు భారీ కల్పన అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.పక్షం రోజులు గడవకముందే అదే గ్రామం నుండి జగిత్యాల వైపు పుష్ప సినిమా తరహాలో అక్రమ కలప రవాణా చేస్తుండటం చేసి అటవీశాఖ అధికారులు అవక్కయ్యారు. ఎవరికి అనుమానం రాకుండా కలప రవాణా చేస్తున్న వాహనంలో క్రింద చెక్కలను దాచడానికి ఒక కాలం ఏర్పాటు చేసి పైనుండి దీనితో వెల్డింగ్ ఏర్పాటు చేసి ఎవరికి అనుమానం రాకుండా ఖాళీ బండి వెళ్తున్నట్టు పన్నాగం పన్ని ఆ ఏర్పాటు చేసిన అర్రలో భారీ కల్ప దాచుకొని వెళ్తున్నటువంటి వాహనం సమాచారం.. అటవీశాఖ అధికారులకు తెలవడంతో ముందస్తు చర్యల కోసం ఆర్ టి శాఖ అధికారులు నిఘా ఉంచారు.అటవీశాఖ అధికారులు వాహనాన్ని ఆపి అక్కడికి వెళ్లే సరిగే అక్రమార్కులు అక్కడి నుండి వాహనం నిలిపివేసి పారిపోవడం జరిగింది. వాహనాన్ని అటవీశాఖ కార్యాలయానికి తరలించి కలపను సీజ్ చేసి కలప దొంగలను పట్టుకోవడానికి చర్యలు మొదలుపెట్టినట్టు అటవీశాఖ అధికారి తెలిపారు.దేవుని గూడ గ్రామంలో ఒక పేస్ క్యాంప్ సిబ్బందిని ఎల్లప్పుడూ అక్కడే ఉంచాలని కొంతమంది అటవీ ప్రేమికులు కోరుతున్నారు ఇప్పటివరకు దొరికిన కలపలో దాదాపుగా దేవుని గుడ ,కవ్వాల్ ప్రాంతానికి చెందిన వారే పట్టుబడడం విశేషం..ఈ ఆక్రమార్కుడు పట్టు పడడం వీరిపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించడం కోర్టు వారు చిన్నచిన్న శిక్షలు విధించి వేలు ఇవ్వడం ఈ అటవీ దొంగలు అదే తథంగాన్ని కొనసాగించడం ఇది వారికి మామూలుగా అనిపిస్తుంది.అందుకే వీరికి నాన్ బేలేబుల్ కేసులు విధించి కఠిన చర్యలు చేపట్టినప్పుడే ఈ అక్రమ కలప రవాణా ఆగుతుందని అటవీ ప్రేమికులు కోరుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా అటవీ ప్రాంతం నుండి వెళ్లేటటువంటి అక్రమ కలప జంతువు వేట అక్రమ ఇసుక రవాణాలను అడ్డుకుంటున్న ఇంధన పెల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ పలువురు అభినందిస్తున్నారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి




తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డిమాండ్

**రాజేంద్రనగర్,జులై20(సూర్యరేఖ):**ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజేంద్రనగర్ లో ఉపాధ్యాయులు,ఉద్యోగులు,పెన్షనర్ల సమస్యల పరిష్కారం కొరకు ఇందిరాపార్క్ ఆగస్టు1 న మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణను రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్,రాజేంద్రనగర్ కాంప్లెక్స్ హెడమాస్టర్ జూపల్లి శ్రీనివాసరావు,తపస్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కె.హనుమంత్ రావులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం తరపున చొరవ చూపుతామని తెలిపారు.అవసరమైతే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని వివరించారు.పిఆర్సి రిపోర్ట్ తెప్పించుకొని 51 శాతం ఫిట్మెంట్ ప్రకటించాలని,పెండింగ్ లో ఉన్నటువంటి 6 డి ఏ లను వెంటనే క్లియర్ చేయాలని,పెండింగ్ బిల్లును సత్వరం చెల్లించాలని,2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని,సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను అమలు చేయాలని,ఎస్ఎస్ఏ,కేజీబీవీ ఉపాధ్యాయినీల 29 రోజుల సమ్మె శాలరి చెల్లిస్తూ ఎంటియస్ ను మంజూరు చేయాలని,మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దును అమలు చేయాలని,జిహెచ్ఎం ఆపై స్థాయి ప్రమోషన్లకు ప్రత్యేక కార్యాచరణను, ప్రత్యామ్నాయ మార్గాలను ప్రకటించాలని, అన్ని రకాల గురుకుల గిరిజన ఆశ్రమ ఎయిడెడ్ పాఠశాల లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల, పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతి సంవత్సరం జూన్




మొదటి వారంలోనే అన్ని గ్రాంట్స్ లను చెల్లించాలని,జూలై 31 కట్ ఆఫ్ డేట్ గా నిర్ణయిస్తూ,ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం ప్రమోషన్ బదిలీ షెడ్యూల్ విడుదల చేయాలని,190 జీఓ ప్రకారం అప్పీల్ చేసుకున్న ఉపాధ్యాయులందరికీ ఉత్తర్వులు ఇవ్వాలని,2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని,టెట్ అర్హత మార్కులు 40 శాతంగా నిర్ణయం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ,ప్రధాన కార్యదర్శి గుంజరి బాలకృష్ణ,జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస రెడ్డి,మండల మహిళా కన్వీనర్ విజయమ్మ, ఉపాధ్యక్షురాలు,నాగరాణి,తపస్ సభ్యులు,మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన సీఐ అంజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు



**మేడ్చల్,జూలై20(సూర్యరేఖ)**మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కిష్టాపూర్--పూడూరు డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మేడ్చల్ పోలీస్ స్టేషన్లో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ ను బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సీఐని శాలువతో సన్మానించి,విధి నిర్వహణలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.మేడ్చల్ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు తమవంతు సహకారం అందిస్తామని నాయకులు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం లో పోలీసు--ప్రజల సమన్వయం మరింత బలోపేతం కావాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్,బీఆర్ఎస్ నాయకులు నడికొప్పు నాగరాజు,నరేష్,పవన్, బాలరాజ్, మహేందర్,ప్రవీణ్,సాయి,సలీం తదితరులు పాల్గొన్నారు.

## గంజాయిని విక్రయిస్తున్న ముఠా అరెస్ట్





**రాజేంద్రనగర్,జులై20(సూర్యరేఖ):** అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న ఓ ముఠానుఅత్తాపూర్ పోలీసులు టాస్క్ ఫోర్స్ పోలీసుల సహకారంతో పట్టుకున్నారు.వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హసన్ నగర్ లోని టాస్క్ ఫోర్స్ పోలీసులకు పక్కా సమాచారం రాగా ఒక్కసారిగా దాడులు నిర్వహించారు.సాజిద్ అనే యువకుడు దగ్గర నుండి 8.5 కిలోల గంజాయి స్వాధీనం స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు 8 మంది యువకులను కూడా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.గంజాయిని ఎటు నుంచి తీసుకొని వచ్చారనే కోణంలో ఇంకా మిగతా సమాచారాన్ని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్న ఎనిమిది మంది యువకులతో పాటు సాజిద్ అనే యువకుడిని అత్తాపూర్ పోలీసుస్టేషన్ విచారణ చేస్తున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో మహమ్మద్ ఫైజాన్,సయ్యద్ సాదిక్,అలీ అహ్మద్,రియాజ్ అహ్మద్ ఖాన్,మొహ్మద్ జాఫర్,యూసుఫ్ బేగ్ లు ఉన్నారు.

## గాంధీనగర్ పోచమ్మ గుడి సాక్షిగా అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణం జోరుగా కొనసాగుతోంది.



**సికింద్రాబాద్ సిటీ,జూలై20(సూర్యరేఖ)** అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంజూరైన అనుమతులు ఒకలా ఉంటే,నిర్మాణం మరోలా సాగుతున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు..? ఇంత భారీ అక్రమ నిర్మాణం జరుగుతున్నా జోనల్ కమిషనర్ స్పందించకపోవ డంపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలను బేఖాతరు చేస్తూ నిర్మాణం సాగుతున్నా కూల్చివేత నోటీసులు లేకపోవడం అధికారుల వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.అక్రమ నిర్మాణాలకు అధికారుల మౌనమే పరోక్ష ప్రోత్సాహమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్న నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకునే అధికారులు, భారీ భవనాల విషయంలో ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారనే ప్రశ్న తలెత్తుతోంది. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం తన బాధ్యతలను విస్మరించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాల వల్ల ప్రజల భద్రత, పట్టణ ప్రణాళికకు ముప్పు ఏర్పడుతున్నా అధికారుల్లో చలనం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అక్రమ నిర్మాణంపై వెంటనే సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అతి త్వరలో పూర్తి వివరాలతో సూర్యరేఖ దినపత్రిక మీ ముందుకు...

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హ ఓటరు భాగస్వామి కావాలి:

తీగుళ్ల రామేశ్వర్ గౌడ్





**సికింద్రాబాద్ సిటీ,జూలై20(సూర్యరేఖ)** సికింద్రాబాద్ శాసనసభ్యులు ,మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు వారాసిగూడలో బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్) సహాయత శిబిరాన్ని బీఆర్ఎస్ యువ నాయకులు తీగుళ్ల రామేశ్వర్ గౌడ్ సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా రామేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హ ఓటరు భాగస్వామి కావడం ద్వారా ఓటు హక్కు కోల్పోకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు.ఓటర్లకు అవసరమైన సహాయం కోసం సీతాఫలమండిలోని ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. అంతకుముందు సీతాఫలమండి ఎమ్మెల్యే కార్యాలయంలో సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి,నిర్వహణ తీరుపై సమన్వయ కమిటీ ప్రతినిధుల తో రామేశ్వర్ గౌడ్ సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో సమన్వయకర్త రాజా సుందర్,బొర్రా సత్యనారాయణగౌడ్,జహాంగీర్ భాయి,తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీతో ఓటర్లలో అవగాహన కల్పింపు..





**సికింద్రాబాద్ సిటీ,జూలై20(సూర్యరేఖ)**సికింద్రాబాద్‌లోని వారాసిగూడ షాహ్‌బాజ్‌గూడ ప్రాంతంలోని బూత్ నెం.57లో ఆదివారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్)ఎన్యూమరేషన్ ఫారమ్‌లను ఇంటింటికీ పంపిణీ చేస్తూ ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సయ్యద్ సద్దాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంబంధిత బీఎల్ఓ విజయ్ కుమార్, జి.చంద్రశేఖర్,మరిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారమ్‌లను ఎలా సక్రమంగా పూరించాలి,ఏ విధంగా సమర్పించాలి అనే అంశాలపై వివరించారు.అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యతను తెలియజేస్తూ,ప్రతి ఓటరు తమ వ్యక్తిగత వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి గడువులోపు ఫారమ్‌లను సమర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జీఎస్ఆర్ టీమ్ సభ్యులు,బీఆర్ఎస్ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించారు.

# అభివృద్ధి పథంలో గోకవరం గ్రామపంచాయతీ..







**ఖమ్మం,జులై20(సూర్యరేఖ)** కల్లూరు మండల పరిధిలోని గోకవరం గ్రామపంచాయతీ దినదిన అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతుంది .గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శీను,గ్రామ కార్యదర్శి భావన ఆధ్వర్యంలో అభివృద్ధి వైపు పరుగులెత్తుతుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ...మా గ్రామ పంచాయతీలో వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగింది.దానిలో భాగంగా 99రోజుల కార్యచలనలో భాగంగా డ్రైనేజీ పూడికతీత నీటి నిల్వలను తొలగించడం, పరిసరాలను శుభ్రం చేయటం గ్రామ ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా గ్రామంలో చేతిపంపుల రిపేరు మరియు మిషిని భగీరథ నీటి లీకేజీలు పంచాయతీ పరిధిలోనే పూర్తి చేయటం జరిగింది.గ్రామ సమైక్య బిల్డింగ్ పది లక్షలతో పనులు చురుకుగా నిర్వహిస్తున్నామని ,గ్రామపంచాయతీ బిల్డింగ్ పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నామని,మా గ్రామ పంచాయతీలో సుమారు 50 రకాల నర్సరీ మొక్కలు పెంచుతున్నామని, మొక్కల పై ప్రత్యేక శ్రద్ధతో హరితహారం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సార్ మా గ్రామ పంచాయతీ పరిధిలో 980ఓట్లు గాను 880సర్వే పూర్తి చేసి మండలంలోని ప్రధమ స్థానంలో ఉన్నామని మీడియాకు తెలియజేస్తూ ఆనందం వ్యక్తపరిచారు.మాకు తొలి విడతలో ఇందిరమ్మ గృహాలు15 మంజూరయ్యాయి.వాటిని పూర్తిస్థాయిలో నిర్మించుకోవడం జరిగింది.మరల నిరుపేదలకు పార్టీ పరంగా కాకుండా మరో 25 గృహాలు మంజూరు చేయగలరని ప్రభుత్వాన్ని కోరటం జరిగిందని తెలియజేశారు.

# చిలుకానగర్ లో డ్రైనేజీ,రహదారి సమస్యలను వెంటనే పరిష్కరించాలి:





## జోనల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి

**ఉప్పల్,జూలై20(సూర్యరేఖ):** చిలుకానగర్ డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ,వర్షపు నీటి అవుట్‌లెట్ సమస్యలతో పాటు అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను తక్షణమే పూర్తి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...చిలకనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్,అభయాంజనేయస్వామి గుట్ట, మైసమ్మ గుడి ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు, డ్రైనేజీ నీటి అవుట్‌లెట్ సమస్య కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు అత్యవసర చర్యలు చేపట్టాలని కోరారు.అలాగే చిలకనగర్ చౌరస్తాలోని హనుమాన్ ఆలయం నుంచి మైసమ్మగుడి వరకు రహదారి నిర్మాణానికి ఇప్పటికే పరిపాలనా ఆమోదం లభించినప్పటికీ,మధ్య వరకు మాత్రమే పనులు పూర్తి చేసి మిగిలిన భాగాన్ని తవ్వి వదిలేయడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని వివరించారు.త్వరలో బోనాల పండుగ నేపథ్యంలో పోచమ్మ, మైసమ్మ ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున,రహదారి పనులను అత్యవసరంగా పూర్తి చేసి భక్తులు,స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే కోరారు.ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి,అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి, ఈరెల్లి రవీందర్ రెడ్డి,చేర్యాల శ్రీనివాస్,గడ్డం పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సర్"ప్రక్రియ మనందరి బాధ్యత సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలను అమలు చేయాలి..

## కాంగ్రెస్ శ్రేణులంతా క్షేత్ర స్థాయిలో పని చేయాలి

## పార్టీ శ్రేణులకు కాంగ్రెస్ పార్టీ నేతల పిలుపు

**ఉప్పల్,జూలై20(సూర్యరేఖ)** అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు జాబితా తొలగించకుండా చూడాలని పలువురు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. బీఎల్ఓలతో మన పార్టీ బీఎల్ఏలు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగేలా నాయకులు చూడాలని సూచించారు.సీఎం రేవంత్ రెడ్డి,టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్,ల ఆదేశాల మేరకు ఉప్పల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు,డివిజన్ కో-ఆర్డినేటర్లు, బూత్ కో-ఆర్డినేటర్లతో "సర్"ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా పార్లమెంట్ కోర్డినేటర్ సుబ్రహ్మణ్యం,ఉప్పల్ కోర్డినేటర్ వరలక్ష్మి,జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్,ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి,లు హాజరై మాట్లాడారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఎస్ఐఆర్ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం ఉండొద్దన్నారు.దళితులు,ఆదివాసీలు, మైనారిటీలు,మహిళలు,వలస కార్మికుల ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉందన్నారు.కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌పై అవగాహన సమావేశాలు నిర్వహించి, ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు .క్లస్టర్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించు కునేలా చూడాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పార్టీ అత్యంత కీలక అంశంగా పరిగణించిందన్నారు. సర్ ప్రక్రియ తుది దశలో ఉందన్నారు .ఇదే అత్యంత కీలకమన్నారు.ఓటర్ల నుంచి ఎన్యూమరేష న్ ఫారాలను తీసుకుని ఆన్ లైన్ చేసేంతవరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





# ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం..

## ప్రజావాణిలో సబ్ కలెక్టర్




**ఖమ్మం,జులై20(సూర్యరేఖ)**ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో కల్లూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ శ్రీవారి అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సంబంధిత అధికారులు పాల్గొని ప్రజల నుండి వినతులు,ఫిర్యాదులు మరియు దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజలు భూ సంబంధిత వివాదాలు,రెవెన్యూ అంశాలు,సంక్షేమ పథకాలు,పింఛన్లు, ఉపాధి,తాగునీరు,విద్యుత్, రహదారులు మరియు ఇతర ప్రజా సమస్యలకు సంబంధించిన వినతులను సమర్పించారు. సబ్‌కలెక్టర్ శ్రీప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల స్వరూపాన్ని తెలుసుకొని సంబంధిత శాఖల అధికారులకు వెంటనే చర్యలు తీసుకుని, అర్హత ఉన్న ప్రతి వినతికి నిర్ణీత గడువులోగా పరిష్కారం అందించాలని ఆదేశించారు. అదేవిధంగా, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశిస్తూ,ప్రభుత్వ సేవలను పారదర్శకంగా,సమర్థవంతంగా ప్రజలకు అందించడం ప్రతి శాఖ యొక్క బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా పరిగణించి,వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా మరియు మండల స్థాయి అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో ప్రభుత్వ భూముల కబ్జాలపై చర్యలు తీసుకోవాలని జేఏసీ వినతి..







**బెల్లంపల్లి,జూలై20(సూర్యరేఖ)**సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్)కార్యక్రమం లేకపోవడంతో విప్లవ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.కన్నాల గ్రామపంచాయతీ శివారులోని సర్వే నంబర్లు 60,112, 114,142, 143లో ఉన్న ప్రభుత్వ భూములు భూ మాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు,దళారుల కబ్జాలకు గురవుతున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. అధికార పార్టీల అండతో ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని ఆరోపించారు.అలాగే ఎర్రకుంట చెరువును సైతం ఆక్రమించారని,చెరువును పునరుద్ధరించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ అనుమతులు లేకుండానే వెంచర్లు ఏర్పాటు చేసి,గ్రామపంచాయతీ ద్వారా ఇంటి నంబర్లు,పన్ను రసీదులు జారీ చేస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ఇంటి స్థలాలు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇటీవల నేమెల్ల గుట్టను తవ్వుతున్న విషయంపై రెవెన్యూ,మైనింగ్ శాఖలను సంప్రదించినప్పటికీ స్పష్టమైన చర్యలు తీసుకోలేదని తెలిపారు. జిల్లా పాలనాధికారి,స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని భూకబ్జాలను అరికట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టి.మణి రాంసింగ్ (టీఎన్‌టీయూసీ),అంబాల మహేందర్ (ఎస్‌జీకేఎస్), ఎం. పోశమల్లు (ఏఐఎఫ్‌టీయూ), గోగర్ల శంకర్ (టీయూసీఐ)పాల్గొన్నారు.

# సర్" ప్రక్రియ సాఫీగా సాగేలా సహాయ కేంద్రాలు పని చేయాలి..

## కాంగ్రెస్ శ్రేణులకు మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పిలుపు




**ఉప్పల్,జూలై20(సూర్యరేఖ)**సర్ ప్రక్రియ సాఫీగా,వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితప రమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ ఇందిరనగర్ కాలనీ వద్ద కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఈగ ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి సోమవారం పరిశీలించారు.నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు. బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ,సల్ల ప్రభాకర్ రెడ్డి అలుగుల అనిల్, వెంకట్ రెడ్డి,తౌకట రాజు,గౌరిగె మహేష్, సిల్వేరు ప్రేమ్ కుమార్, బాకారం అరుణ్,నగరం వెంకట్,మండలం నాగరాజు,ప్రశాంత్ రెడ్డి,సల్ల అంజి, జంగయ్య, మరియు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# స్పిరిట్ -26అంతర హోమియో వైద్య కళాశాలల క్రీడల్లో జేఎస్‌పీఎస్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల ఘన విజయం..




**రామంతాపూర్,జూలై 20(సూర్యరేఖ)** గురునానక్ హోమియో వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల18,19 తేదీల్లో నిర్వహించిన "ఎస్పిరిట్-26" అంతర హోమియో వైద్య కళాశాలల క్రీడా పోటీల్లో జేఎస్‌పీఎస్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి పలు విభాగాల్లో అగ్రస్థానాలను కైవసం చేసుకున్నారు.వివిధ హోమియో వైద్య కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో జేఎస్‌పీఎస్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల జట్లు సమష్టి కృషి, క్రీడాస్ఫూర్తితో అద్భుత ప్రదర్శన చేసి క్రికెట్, వాలీబాల్ విభాగాల్లో విజేతలుగా (విన్నర్స్) నిలిచాయి.అలాగే త్రోబాల్,బ్యాడ్మింటన్ విభాగాల్లో రన్నరప్ స్థానాలను దక్కించుకుని కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు.క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ,జట్టు భావన,నాయకత్వ లక్షణాలు,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.కళాశాల తరఫున విద్యార్థులకు ఎల్లప్పుడూ పూర్తి స్థాయి ప్రోత్సాహం అందిస్తామని, భవిష్యత్తులో రాష్ట్ర,జాతీయ స్థాయిలోనూ మరిన్ని విజయాలు సాధించి కళాశాల ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.ఈ విజయానికి కృషి చేసిన క్రీడాకారులు,శిక్షకులు, అధ్యాపక బృందాన్ని అభినందించారు.విద్యార్థుల విజయాలను పురస్కరించుకుని కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు.విజేతలను అధ్యాపకులు, సహ విద్యార్థులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి,డాక్టర్ కృష్ణమూర్తి, కళాశాల క్రీడల సమన్వయకర్తలు డాక్టర్ జార్జ్ ముల్లర్, విజయశోరి, అనిల్,శ్వేత,అధ్యాపక బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెడికల్ బోర్డు పేరుతో కార్మికులకు అన్యాయం..

ఏఐటీయూసీ నాయకుల ఆగ్రహం..




**మందమర్రి,జూలై20(సూర్యరేఖ)** సింగరేణి యాజమాన్యం నిర్వహించిన తాజా మెడికల్ బోర్డు ప్రక్రియ కార్మికులకు తీవ్ర నిరాశ కలిగించిందని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు విమర్శించారు.స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ,బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్ మాట్లాడుతూ...కార్మికుల న్యాయమైన హక్కులను కాలరాస్తూ మెడికల్ బోర్డును కేవలం నామమాత్రంగా నిర్వహించడం సరికాదని వారు పేర్కొన్నారు.గత కొంతకాలంగా మెడికల్ బోర్డును ఏర్పాటు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ సమ్మె నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.ఇతర కార్మిక సంఘాలు కూడా ఉద్యమాల్లో పాల్గొనడంతో యాజమాన్యం స్పందించి ఈ నెల 17,18 తేదీల్లో మెడికల్ బోర్డును నిర్వహించినప్పటికీ,అది కార్మికుల ఆశలకు అనుగుణంగా జరగలేదని అన్నారు. గతంలో మెడికల్ బోర్డు ద్వారా 40నుంచి 50శాతం వరకు అన్‌ఫిట్ (ఇన్‌వాలిడేషన్) అవకాశాలు కల్పించేవారని,ప్రస్తుతం కేవలం 20శాతం మందికే పరిమితం చేయడం వెనుక రాజకీయ జోక్యం ఉందని ఆరోపించారు. ఈ సమావేశంలో జీఎం ఆఫీస్ స్ట్రక్చర్ కమిటీ సభ్యులు సి.వి.రమణ,గోపతి సత్యనారాయణ,నాగేశ్వరరావు,ఫిట్ కార్యదర్శులు గాండ్ల సంపత్,మర్రి కుమారస్వామి,కల్వల శ్రీనివాస్, నాగరాజు,తోట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

# నూతనంగా నిర్మించిన రోడ్డు నాణ్యతను పరిశీలించి చర్యలు తీసుకోవాలి..

ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ



**ఉప్పల్,జూలై20(సూర్యరేఖ)** మేడ్చల్--మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ సర్కిల్ రామంతాపూర్ ఇందిరానగర్‌లో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలించి,నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ డిమాండ్ చేసింది .ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్, నాయకుడు ఒంపు లక్ష్మయ్య మాట్లాడుతూ... ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ నుంచి పాపయ్య మిర్చి బండి వరకు నూతనంగా నిర్మించిన రోడ్డు పనులు పూర్తై వారం రోజులు గడిచినా,రోడ్డుకు అవసరమైన వాటర్ క్యూరింగ్ సక్రమంగా చేపట్టలేదని ఆరోపించారు.రోడ్డుపై మట్టితో కట్టలు ఏర్పాటు చేసి నిరంతరంగా నీటితో క్యూరింగ్ చేయాల్సి ఉండగా,కేవలం వాటర్ ట్యాంకర్‌తో కొద్దిసేపు నీరు పోసి వెళ్లిపోతున్నారని,దీంతో నీరు వెంటనే ఆరిపోవడంతో రోడ్డు మన్నిక తగ్గి త్వరగా దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు.ఇంజినీరింగ్ విభాగం అధికారులు పలుమార్లు సూచించినప్పటికీ కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని,ఈ విషయంపై ప్రశ్నించిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులపై అసభ్య పదజాలంతో దూషిస్తూ,బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపించారు .పైస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పినా,"ఎవరికైనా చెప్పుకోండి, ఏమైనా చేసుకోండి"అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు పేర్కొన్నారు. అందువల్ల రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతపై సమగ్ర విచారణ చేపట్టి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ జోనల్ కమిషనర్‌ను కోరింది.

# లకావత్ ద్వాలి భౌతికాయానికి గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు నివాళి..





**మరిపెడ,జూలై20 (సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తండధర్మారం గ్రామానికి చెందిన లకావత్ రమేష్ నాయనమ్మ లకావత్ ద్వాలి అనారోగ్యంతో కన్నుమూశారు.విషయం తెలుసుకున్న మహబూబా బాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు సోమవారం తండధర్మారం గ్రామానికి చేరుకుని లకావత్ ద్వాలి భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ గూగులోత్ వెంకన్న,సర్పంచ్ బాబునాయక్, పిఏసిఎస్ డైరెక్టర్ గుగులోత్ బాల కిషన్,పానుగోతు వెంకన్న,దిగజార్ల పేపర్ శీను,గ్రామ పెద్దలు,నాయకులు తదితరులు ఉన్నారు.

## ఉప్పల్ కాలభైరవ స్వామి దేవాలయంలో వారాహి పూజ,

అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి







**ఉప్పల్,జూలై20(సూర్యరేఖ)**ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రసిద్ధ శ్రీకాలభైరవ స్వామి దేవాలయంలో నిర్వహించిన పవిత్ర శ్రీవారాహి అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమం మరియు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు,ఆయురారోగ్యాలు,ఐశ్వర్యాలతో ఉండాలని ,తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని భగవంతుడిని కోరడం జరిగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గుండ మల్లయ్య,ఆలయ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గంలో కొత్త బస్తీ దవాఖానాల మంజూరుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి..



**ఉప్పల్,జూలై20(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలంగాణ ఆరోగ్యడకుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ సంగీత సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి,నియోజకవర్గంలో కొత్త బస్తీ దవాఖానలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో వేగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వివరించారు.ప్రజలకు వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు ఉచిత మందులు,అవసరమైన వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా అదనపు బస్తీ దవాఖానలను ఏర్పాటు చేయాలని కోరారు.ఈ వినతిపై ఆరోగ్యశాఖ డైరెక్టర్ సంగీత సత్యనారాయణ సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు అవసరమైన ప్రతి అంశంపై ప్రభుత్వం దృష్టి సారించేలా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## చౌకత్‌పల్లిలో ఎస్ఐఆర్ ప్రక్రియ 100శాతం పూర్తి..



**నిజాంపేట,జూలై 20(సూర్యరేఖ)** మండల పరిధిలోని చౌకత్‌పల్లి గ్రామంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను 100శాతం విజయవంతంగా పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ సునీత తెలిపారు.గ్రామ ప్రజల సహకారం, బీఎల్ఓలు మరియు సంబంధిత అధికారుల సమన్వయంతో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజలు అందించిన సహకారానికి ఈ సందర్భంగా సర్పంచ్ సునీత కృతజ తలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి జితేందర్,బిఎల్ఓ సువర్ణ, సూర్యనాయక్,వార్డు సభ్యులు జైపాల్,భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణతో ఆరోగ్యం..

వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి

మరిపెడ పీహెచ్‌సీ పరిధిలో విజయవంతంగా ఆల్బెండజోల్ మోపప్ డే..

అర్హులైన చిన్నారులకు మాత్రల పంపిణీ..

పాల్గొన్న వైద్య సిబ్బంది,స్కూల్,అంగన్ వాడి టీచర్లు..






**మరిపెడ,జూలై 20(సూర్యరేఖ)** నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శారీరక,మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి తెలిపారు.జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన ఆల్బెండజోల్ మోపప్ డే కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.గతంలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా వివిధ కారణాలతో ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోలేకపోయిన1నుంచి 19సంవత్స రాల వయస్సు గల చిన్నారులు,యువతకు ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా మాత్రలు పంపిణీ చేశారు.మరిపెడ పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు,ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్,డిగ్రీ కళాశాలల్లో వైద్య బృందాలు ప్రత్యక్షంగా వెళ్లి అర్హులైన విద్యార్థులకు మాత్రలు మింగించారు.ఈ సందర్భంగా డాక్టర్ గుగులోత్ రవి మాట్లాడుతూ...ఆల్బెండజోల్ మాత్రలు నులిపురుగులను నివారించి పిల్లల్లో రక్తహీనతను తగ్గించడంలో,పోషకాహార లోపాలను అధిగమించడంలో,ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడతాయని తెలిపారు.ప్రతి అర్హత కలిగిన చిన్నారికి మాత్ర అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వామి,డాక్టర్ కిరణ్,హెల్త్ సూపర్‌వైజర్లు,ఏఎన్ఎంలు,ఆశా ఆరోగ్య కార్యకర్తలు,పల్లె దవాఖాన సిబ్బంది, ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## వైన్స్ షాపులను తనిఖీ చేసిన ఎక్సైజ్ అధికారులు



**నిజాంపేట,జూలై20(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని శ్రీదత్త సాయివైన్స్, శ్రీనివాస వైన్స్‌లలో ఎక్సైజ్ ఎస్ఐ విజయ్ సిద్ధార్థ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా మద్యం విక్రయాల రికార్డులు,స్టాక్ వివరాలు ,లైసెన్స్ నిబంధనల అమలు తదితర అంశాలను పరిశీలించారు .నిబంధన లకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరపరాదని,ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వైన్స్ నిర్వాహకులకు సూచించా రు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, వైన్ షాపుల నిర్వాహకులు ఉన్నారు.

## బీజేపీ యువ నేత యోగి రాజ్ సింగ్ జన్మదిన శుభాకాంక్షల వెల్లువ..



**నాంపల్లి,హైదరాబాద్,జూలై 20(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ యువ నాయకులూ యోగి రాజ్ సింగ్ జన్మదినంను పురస్కరించుకొని కార్వాన్ నియోజకవర్గం భారత రాష్ట్ర సమితి పార్టీ కార్వాన్ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ ముత్యాల భాస్కర్ నేతల బృందంతో మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.శుభాకాంక్షలు తెలిపినవారిలో బిఆర్ఎస్ కార్వాన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దుర్గా రాజు,కృష్ణమూర్తి,శేఖర్,విక్కీ,కృష్ణ,హర్షవర్ధన్,తదితరులు పాల్గొన్నారు.

## 22వ వార్డులో రూ.15లక్షలతో సిమెంట్ రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం..



**బెల్లంపల్లి,జూలై20(సూర్యరేఖ)**బెల్లంపల్లి పురపాలక పరిధిలోని 22వ వార్డులో రూ.15లక్షలతో చేపట్టను న్న సిమెంట్ రహదారి నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. బెల్లంపల్లి శాసనసభ్యుడు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పురపాలక చైర్‌పర్సన్ దావస్వాతి--రమేష్‌బాబు పాల్గొన్నారు.కార్యక్రమంలో వార్డు ప్రజాప్రతినిధులు పీక ఎల్లబోయ్,జంగం కల్పన--గౌస్,నాయకులు కంకటి శ్రీనివాస్,పీక లక్ష్మణ్,నీలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.ఈ రహదారి నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని తెలిపారు.

## రోడ్లపై మద్యం సీసాలు పగులగొడుతున్న మందుబాబులు..

ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



**నిజాంపేట,జూలై20(సూర్యరేఖ)**మండల కేంద్రంలో కొందరు మందుబాబులు మద్యం సేవించి రోడ్డుపై మద్యం సీసాలను పగులగొడుతూ వీరంగం సృష్టిస్తున్నారు.ముఖ్యంగా వైన్స్ దుకాణాల సమీపంలోనే సీసాలను పగులగొట్టడంతో రోడ్డుపై గాజు పెంకులు పేరుకుపోతున్నాయి.దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ద్విచక్ర వాహనాల టైర్లు పంక్చర్ అయ్యే ప్రమాదంతో పాటు, పాదచారులకు గాయాలయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై పోలీసులు,సంబంధిత అధికారులు స్పందించి వైన్స్ దుకాణాల వద్ద పర్యవేక్షణ పెంచడంతో పాటు రోడ్లపై మద్యం సీసాలు పగులగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మల్కపల్లి దళితవాడ సమస్యల పరిష్కారానికి ప్రజావాణిలో వినతి..



**కాసిపేట,జూలై20(సూర్యరేఖ)**కాసిపేట మండలం మల్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దళితవాడలో నెలకొన్న పలు మౌలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దళిత సామాజిక నాయకులు పడిగేల ఎల్లన్న,పడిగేల మహేందర్ సోమవారం మండల ఎంపీడీవో సత్యనారాయణ సింగ్‌కు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత కేటాయింపుల్లో అర్హులైన మాదిగ సామాజిక వర్గానికి చెందిన నిరుపేదలను పక్కనపెట్టి,కమిషన్లు ఇచ్చిన వారికి ఇళ్లను కేటాయిస్తున్నారని ఆరోపించారు.ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.అదేవిధంగా దళితవాడలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక దోమలు విపరీతంగా పెరిగి వర్షాకాలంలో విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. గ్రామంలోని రహదారులు పూర్తిగా దెబ్బతిని బురదమయంగా మారడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు.ఈ సమస్యలపై పలుమార్లు గ్రామసర్పంచ్,పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే సంబంధిత అధికారులు స్పందించి దళితవాడలోని సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో జీడికంటి నరేష్,మామిడిసాగర్, ముదుగుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాల ఆరోగ్య జాగ్రత్తలపై విద్యార్థులకు వైద్య అవగాహన..



**మందమర్రి,జూలై20(సూర్యరేఖ)** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు పాటించాల్సిన ఆరోగ్య నియమాలపై మందమర్రి పట్టణంలోని 2వ జోన్ ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.డాక్టర్ జాహ్నవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు సూచనలు అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వర్షాకాలంలో డెంగ్యూ,మలేరియా,చర్మ సంబంధిత వ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశమున్నందున విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.తడి దుస్తులు ధరించకుండా ఉండటంతో పాటు బయట లభించే అపరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు.జ్వరం, ఒంటినొప్పులు,చర్మ సమస్యలు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదిస్తే వ్యాధులను ప్రారంభ దశలోనే అదుపులోకి తీసుకురావచ్చని వివరించారు. కార్యక్రమం అనంతరం ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది,హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పల్లె దవాఖానకు ప్రహరీ గోడ నిర్మించాలి..

గ్రామస్తుల విజ్ఞప్తి




**నిజాంపేట,జూలై 20(సూర్యరేఖ)** మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన పల్లె దవాఖానకు ఇరువైపులా ప్రహరీగోడ లేకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .ప్రహరీ గోడ లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు మద్యం సేవించి దవాఖాన ఆవరణలోనే మద్యం సీసాలను పడేసి వెళ్తుండటంతో రోగులు,వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే దవాఖానకు వెళ్లే మెట్లు ఎత్తుగా ఉండటంతో వృద్ధులు,గర్భిణీ స్త్రీలు,ఇతర రోగులు దవాఖానలోకి చేరుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అదేవిధంగా దవాఖాన పరిసరాల్లో పందులు ,కుక్కలు సంచరిస్తుండటంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొని దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు పేర్కొన్నారు.లక్షల రూపాయలతో పల్లె దవాఖానను నిర్మించినప్పటికీ,భద్రత కోసం అవసరమైన ప్రహరీ గోడతో పాటు రోగుల సౌకర్యానికి అనుగుణంగా ర్యాంపు లేదా మెట్ల సదుపాయాన్ని మెరుగుపరచడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు.దవాఖాన పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలంటే వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని, రోగులు, వృద్ధులు,గర్భిణీ స్త్రీలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దవాఖాన సేవలను వినియోగించుకునేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

## నెన్నెల గ్రామంలో ప్రతి ఇంటికి మొక్కల పంపిణీ..



**నెన్నెల,జూలై20 (సూర్యరేఖ)** నెన్నెల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి ఇంటికి పండ్ల,పూలకు చెందిన ఆరు మొక్కలను సర్పంచ్ ఎండీ ఇబ్రహీం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...మొక్కల పెంపకం కేవలం పర్యావరణ పరిరక్షణకే కాకుండా మానవ మనుగడకు కూడా అత్యంత అవసరమని తెలిపారు.మొక్కలు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను విడుదల చేసి గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. చెట్ల వేర్లు నేలను గట్టిగా పట్టి ఉంచడం వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు నేల కోతను నివారించవచ్చని పేర్కొన్నారు.మొక్కల వల్ల పరిశుభ్రమైన గాలి,నీటి సంరక్షణ,వర్షాల పెరుగుదల, భూగర్భ జలాల అభివృద్ధి,ఆహార భద్రత, జీవవైవిధ్య పరిరక్షణ వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు.అలాగే పచ్చని వాతావరణంలో గడపడం వల్ల మానసిక ప్రశాంతత,ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని చెప్పారు.ప్రతి కుటుంబం పంపిణీ చేసిన మొక్కలను తప్పనిసరిగా నాటి సంరక్షించాలని గ్రామ ప్రజలకు సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్,వార్డు సభ్యుడు గోగు నరేష్, గ్రామపంచాయ తీ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

# అసిఫ్ నగర్,గోల్కొండ మండలాల పరిధి విద్యాశాఖలో అవినీతి దందా..

ప్రైవేటు స్కూళ్ల నుంచి యథేచ్ఛగా వసూళ్లు,పట్టించుకోని ఉన్నతాధికారులు.



**నాంపల్లి,హైదరాబాద్,జూలై20(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ ఎన్నో సంస్కరణలు తెచ్చి ఉన్నత ప్రమాణాలతో తీర్చి దిద్దాలని సిఎం రేవంత్రెడ్డి ఆదేశాలు జారీ చేస్తుండగా కొందరు విద్యాశాఖ అధికారుల కారణంగా ఇది నీరుగారి పోతుంది.విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాల్సిన విద్యాశాఖ ఉన్నతాధికారులు కొందరు అవినీతికి పాల్పడుతూ అందినకాడికి దండుకుంటున్నారు.అసిఫ్ నగర్,గోల్కొండ మండలాల పరిధిలో యథేచ్ఛగా సాగుతున్న అవినీతి దందా బాగోతం వివరాలు ఇలా ఉన్నాయి. అసిఫ్ నగర్,గోల్కొండ మండలాల పరిధిలోని పలు ప్రైవేటు విద్యా సంస్థలు కొనసాగుతున్నా వీటిల్లో మౌళిక వసతులు,విద్యార్థులకు సదుపాయాలు చూడాల్సిన విద్యాశాఖ అధికారులు అవినీతికి పాల్పడుతూ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారనే విమర్శలు ఉన్నాయి.అసిఫ్ నగర్,గోల్కొండ మండలాల విద్యాశాఖలో పనిచేస్తున్న ఒక అధికారి ప్రైమరీ స్కూల్ నుంచి హైస్కూల్ వరకు రేటు నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారనే పిర్యాదులు ఉన్నాయి.దీంతో పాటు కొత్త స్కూల్ అనుమతి కావాలంటే రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఇవ్వాల్సిందేనని,లేకుంటే ఫైల్ ముందుకు కదలదని పలువురు బాహటంగా చెప్పుకుంటున్నారు.కొత్త పాఠశాల ఏర్పాటు చేయాలంటే రెండు సార్లు విచారణ చేస్తారని,వచ్చిన ప్రతిసారి రూ.10వేల వరకు ఇవ్వాల్సిందేనని పలువురు పేర్కొంటున్నారు.

ప్రైవేటు వ్యక్తులతో యథేచ్ఛగా వసూళ్లు..

అసిఫ్ నగర్,గోల్కొండ మండలాల పరిధిలో కొందరు అధికారులు ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని యథేచ్ఛగా వసూళ్ల కు పాల్పడుతున్నారనే పిర్యాదులు ఉన్నాయి.ప్రైవేటు పాఠశాలలో పుస్తకాల విక్రయాలు,ఇతర సౌకర్యాలు లేవని చెబుతూ పలువురి నుంచి ముందుగా వీరే ఫిర్యాదులు చేయిస్తారు.అనంతరం అధికారులు నిర్ణయించిన వ్యక్తులు స్కూల్ వద్దకు వెళ్లి డబ్బులు వసూళ్లు చేస్తారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎవరైనా ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు డబ్బులు ఇవ్వకపోతే వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్ప డుతారని పలువురు పేర్కొంటున్నారు.గత కొద్ది కాలంగా సాగుతున్న అవినీతి దందాపై పలువురు పాఠ శాల నిర్వాహకులు త్వరలోనే ఉన్నతాధికారులకు తగు ఆధారాలతో ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం.

అవినీతి అధికారులపై ఎసిబి నిఘా..

అసిఫ్ నగర్,గోల్కొండ మండలాల విద్యాశాఖలో జరుగుతున్న అవినీతి దందాపై కొందరు ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇప్పటికే దీనిపై రంగంలోకి దిగిన అధికారులు విద్యాశాఖలో జరుగుతున్న తతంగంపై కన్ను వేసినట్లు తెలిసింది.విద్యాశాఖ కార్యాలయంలో స్కూల్ నిర్వ హకుల నుంచి డబ్బులు దండుకుంటూ అవినీతికి పాల్పడుతున్న వ్యక్తుల సమాచారం ఇప్పటికే కొందరు నిర్వాహకులు అందజేసినట్లు సమాచారం. త్వరలోనే అవినీతికి పాల్పడే తిమింగలాలపై వేటు పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

## కారంపుడి మార్కండేయకు ఘన నివాళి..

దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు,ప్రజాప్రతినిధులు..



**మరిపెడ,జూలై20(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణాని కి చెందిన కారంపుడి మార్కండేయ ఇటీవల మృతి చెందగా, సోమవారం నిర్వహించిన ఆయన దశదిన కర్మ కార్యక్రమానికి పలువురు నాయకులు ,ప్రజాప్రతినిధులు హాజరై ఘనంగా నివాళులర్పించారు.మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.అనంతరం ఆయన కుమారులు కారంపుడి లింగన్న (కావ్య క్లాత్ స్టోర్),కారంపుడి వీరన్న (చైతన్య క్లాత్ స్టోర్),కారంపుడి భద్రాచలం (సుమంగళి క్లాత్ స్టోర్)లతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని ఓదార్పునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాలం రవీందర్ రెడ్డి,గంధసిరి అంబరీష్,కౌన్సిలర్లు గంట్ల గౌతంరెడ్డి,బోడ భాస్కర్,నాయకులు గుండగాని వెంకన్న,తుమ్మ సత్యం తదితరులు పాల్గొన్నారు.

## రూ.500కే రూ.1,500 విలువైన వైద్య పరీక్షలు..

25వ వార్షికోత్సవం సందర్భంగా రూపా డయాగ్నస్టిక్ సెంటర్ ప్రత్యేక ఆఫర్







**మండమర్రి,జూలై20(సూర్యరేఖ)** పట్టణ మార్కెట్ లోని రూపా డయాగ్నస్టిక్ సెంటర్ తమ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల జూలై 23న ప్రజలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షల ఆఫర్ను ప్రకటించింది.సాధారణంగా రూ.1,500 విలువ చేసే పలు కీలక రక్తపరీక్షలను కేవలం రూ.500కే అందించనున్నట్లు నిర్వాహకుడు రమేష్ తెలిపారు.ఈ ప్రత్యేక ప్యాకేజీలో ఎఫ్ బిఎస్,పిఎల్ బి ఎస్,షుగర్ పరీక్షలు,లిపిడ్ ప్రొఫైల్ (కొలెస్ట్రాల్ పరీక్షలు),ఎల్ఎఫ్టి(లివర్ ఫంక్షన్ టెస్టులు),ఆర్ఎఫ్టి (కిడ్నీ ఫంక్షన్ టెస్టులు)నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ పరీక్షల కోసం ఉదయం 7గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు నమూనాలు స్వీకరిస్తారని,ఎఫ్ బిఎస్ పరీక్ష చేయించుకునే వారు తప్పనిసరిగా ఉపవాసంతో రావాలని సూచించారు. అదే విధంగా మరో ప్రత్యేక ఆరోగ్య పరీక్షల ప్యాకేజీని కూడా అందుబాటులో ఉంచారు.ఇందులో కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సిబిపి),మలేరియా (ఎంపి) పరీక్ష,వైడల్ (టైఫాయిడ్)పరీక్ష, సీరమ్ బిలిరుబిన్,పూర్తి మూత్ర పరీక్ష,సి-రియాక్టివ్ ప్రోటీన్(సి ఆర్ పి),డెంగ్యూ ప్రొఫైల్ వంటి పరీక్షలను ప్రత్యేక రాయితీ ధరలో నిర్వహించనున్నట్లు తెలిపారు.మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని రూపా డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకుడు రమేష్ కోరారు. ఈ కేంద్రం మండమర్రి మార్కెట్లోని చికెన్ సెంటర్స్ రోడ్లో ఉందని,మరిన్ని వివరాల కోసం 98497 71321 నంబర్ను సంప్రదించాలని సూచించారు.


# బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం,రథోత్సవం సందర్భంగా నేడు,రేపు ట్రాఫిక్ మళ్లింపులు..

**నాంపల్లి,హైదరాబాద్,జూలై20(సూర్య రేఖ)** బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానంలో 21వ,22వ తేదీలలో నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం మరియు రథోత్సవం సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని హైదరాబాద్ .ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ కళ్యాణోత్సవం మరియు రథోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని,భక్తుల భారీ సమూహం, ఆలయం చుట్టూ వాహనాల రాకపోకలు పెరిగే అవకాశం ఉన్నందున బల్కంపేట పరిసర ప్రాంతాలలో మెస్తరు ట్రాఫిక్ నిలిచిపోయే అవకాశం ఉందని అన్నారు.ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే రహదారులను నివారించాలని మరియు క్రింది ప్రత్యామ్నాయ మార్గాలు,ట్రాఫిక్ మళ్లింపులను ఉపయోగించాలని సూచించడమైనది.

జూలై 21,22 వరకు ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లు..

1.గ్రీన్ ల్యాండ్స్,మాతా టెంపుల్,సత్యం థియేటర్ వైపు నుండి బల్కంపేట ఎల్లమ్మ ఆలయం,ఫతేనగర్ ఫ్లైఓవర్ మరియు ఫతేనగర్ వైపు వెళ్లే ట్రాఫిక్,కు ఎస్.ఆర్ నగర్ 'టీ' జంక్షన్ వద్ద ఎస్.ఆర్ నగర్ కమ్యూనిటీ హాల్ అభిలాష టవర్స్,బి.కె గూడ ఎక్స్ రోడ్,శ్రీరామ్ నగర్ ఎక్స్ రోడ్ నుండి సనత్నగర్,ఫతేనగర్ రోడ్ వైపు మళ్లిస్తారు. 2.ఫతేనగర్ ఫ్లై ఓవర్ నుండి బల్కంపేట ఆలయం వైపు వచ్చే ట్రాఫిక్,ను అనుమతించరు.ఈ వాహనాలను న్యూబ్రిడ్జి హైదరాబాద్ కిచెన్ మార్ట్ వద్ద రబ్ ద్వారా కట్టమైసమ్మ ఆలయం బేగంపేట వైపు మళ్లిస్తారు.3.గ్రీన్ ల్యాండ్స్ బకుల్ అపార్ట్మెంట్స్, ఫుడ్ వరల్డ్ నుండి బల్కంపేట వైపు వచ్చే ట్రాఫిక్,ను అనుమతించరు.వీటిని ఫుడ్ వరల్డ్ ఎక్స్ రోడ్స్ వద్ద సోనాబాయి టెంపుల్.సత్యం థియేటర్, మైత్రీవనం,ఎస్.ఆర్ నగర్ టీ'జంక్షన్ వైపు మళ్లిస్తారు.4.బేగంపేట,కట్టమైసమ్మ ఆలయం వైపు నుండి బల్కంపేట ఆలయానికి వెళ్లే ట్రాఫిక్కు అనుమతించరు.వీటిని బేగంపేట ఫ్లైఓవర్ మాతా టెంపుల్ సత్యం థియేటర్ మైత్రీవనం ద్వారా గ్రీన్ ల్యాండ్స్ వైపు అనుమతిస్తారు.5.ఎస్.ఆర్ నగర్ 'టీ ' జంక్షన్ నుండి ఫతేనగర్ వరకు ఉన్న ఉప సందులు,లింక్ రోడ్లు మూసివేయ బడతాయి.

భక్తుల పార్కింగ్ స్థలాలు:




1.ఆర్ అండ్ బీఆఫీస్,2.జి.హెఫ్.ఎం.సి గ్రౌండ్,3.పద్మశ్రీ అపార్ట్మెంట్స్,డి.కె రోడ్ నుండి నేచర్ క్యూర్ హాస్పిటల్ రోడ్డు వైపు పార్కింగ్,4.ఫతేనగర్ అండర్ బ్రిడ్జ్,5.నేచర్ క్యూర్ హాస్పిటల్, 6.జి.హెఫ్.ఎం.సి ప్లేగ్రౌండ్,సనత్నగర్ పార్కింగ్ స్థలాలుగా పేర్కొన్నారు .ప్రయాణికులు మన సోషల్ మీడియా ప్లాట్ఫారమ్,ట్విట్టర్ హ్యాండిల్ లలో ట్రాఫిక్ అప్డేట్లను అనుసరించాలని విజ్ఞప్తి చేయడమైనది. ప్రయాణంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే,ప్రయాణ సహాయం కోసం మా ట్రాఫిక్ హెల్ప్లైన్ 9010203626 నంబర్,ను సంప్రదించాలని కోరారు.పౌరులందరూ పైన పేర్కొన్న ట్రాఫిక్ మళ్లింపులను గమనించి ,గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని ,హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాల్సిందిగా కోరారు.

## గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం..

మరిపెడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.జీవన్ కుమార్



**మరిపెడ,జూలై20(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక (గెస్ట్ ఫ్యాకల్టీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.జీవన్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగంలో ఒక గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉత్తీర్ణులై సాధారణ అభ్యర్థులు కనీసం 55శాతం,ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు సాధించి ఉండాలని తెలిపారు.పీహెచ్డీ,నెట్,సెట్ అర్హతలు కలిగిన వారికి,అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బోధన అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.ఆసక్తి,అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 21వ తేదీ (మంగళవారం)లోపు కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు 9989264145, 99510 50013 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ టి.జీవన్ కుమార్ తెలిపారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# వార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..





**మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి**

**4,5,8వ వార్డుల్లో డ్రైనేజీ మరమ్మత్తు పనుల పరిశీలన..**

**మరిపెడ,జూలై20(సూర్యరేఖ)**మరిపెడ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి తెలిపారు.సోమవారం మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని 4,5,8వ వార్డుల్లో చేపట్టిన సైడ్ డ్రైనేజీ మరమ్మత్తు పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా 4వ వార్డు పరిధిలోని పోలీస్ స్టేషన్ గల్లీలో కొనసాగుతున్న డ్రైనేజీ మరమ్మత్తు పనులను పరిశీలించి,పనులు నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.అనంతరం 5వ వార్డులో కొనసాగుతున్న పనులను తనిఖీ చేసి వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని అధికారులకు ఆదేశించారు.అలాగే 8వ వార్డులో చేపట్టినవార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..

**మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి**

**4,5,8వ వార్డుల్లో డ్రైనేజీ మరమ్మత్తు పనుల పరిశీలన..**

**మరిపెడ,జూలై20(సూర్యరేఖ)**మరిపెడ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి తెలిపారు.సోమవారం మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని 4,5,8వ వార్డుల్లో చేపట్టిన సైడ్ డ్రైనేజీ మరమ్మత్తు పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా 4వ వార్డు పరిధిలోని పోలీస్ స్టేషన్ గల్లీలో కొనసాగుతున్న డ్రైనేజీ మరమ్మత్తు పనులను పరిశీలించి,పనులు నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.అనంతరం 5వ వార్డులో కొనసాగుతున్న పనులను తనిఖీ చేసి వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని అధికారులకు ఆదేశించారు.అలాగే 8వ వార్డులో చేపట్టిన మరమ్మత్తు పనులను పరిశీలించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అనంతరం ప్రగతి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ...ప్రజల సమస్యలను గుర్తిస్తూ ప్రతి వార్డులో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నట్లు ఆమె తెలిపారు.పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు ప్రగతి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మెరుగు రాము,బోడ భాస్కర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు బోడ రవి,గుగులోతు లచ్చిరామ్,రమేష్,మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జానీ పాషా,వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ లాల్ తదితరులు పాల్గొన్నారు.ను వేగవంతం చేస్తున్నట్లు ప్రగతి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మెరుగు రాము,బోడ భాస్కర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు బోడ రవి,గుగులోతు లచ్చిరామ్,రమేష్,మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జానీ పాషా,వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

# నీటిని వృధా చేస్తే పదివేల జరిమానా

# మెట్రో వాటర్ బోర్డ్ అధికారుల హెచ్చరిక..







**రాజేంద్రనగర్,జూలై20(సూర్యరేఖ)** మెట్రో వాటర్ బోర్డు ద్వారా సరఫరా అయ్యే మంచి నీటిని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వాటర్ బోర్డ్ అధికారులు హెచ్చరించారు. బండలు కడగటం,కార్లు వాష్ చేసి నీటినిరోడ్డుపైకి వదలడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై ఐదు నుంచి పదివేల రూపాయల వరకు జరిమానా విధిస్తామని వాటర్ బోర్డ్ అత్తాపూర్ సర్కిల్ మేనేజింగ్ ఇంజనీర్ శ్రావ్య స్పష్టం చేశారు. నీటి సంరక్షణ,వాటర్ హార్వెస్టింగ్ పిట్ ల ఏర్పాటుపై స్థానిక వాటర్ బోర్డు అధికారులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఇందులో భాగంగా రాధాకృష్ణ నగర్,సోమిరెడ్డినగర్ ప్రాంతాలలో అపార్ట్మెంట్లలో, బస్తీలలో తనిఖీలు చేశారు.వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోతున్నాయని, మేనేజర్ ఇంజనీర్ శ్రావ్య ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నీటి బొట్టును రక్షించడానికి అపార్ట్మెంట్లలో, గేటెడ్ కమ్యూనిటీలలో వాటర్ హార్వెస్టింగ్ పిట్స్, ఇంజక్షన్ బోర్ వెల్స్ ను శాస్త్రీయ పద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.మెట్రో వాటర్ బోర్డు నుంచి సరఫరా అవుతున్న నీటిని ప్రజలు సజీనియోగం చేసుకోవాలి తప్ప దుర్వినియోగపరచరాదని అన్నారు.విలువైన నీటిని వృధా చేసే వారిపై రూపాయలు ఐదు వేల నుంచి పదివేల రూపాయల వరకు జరిమానా విధిస్తున్నట్లు హెచ్చరించారు.నీటి సంరక్షణ,దుర్వినియోగని అరికట్టడానికి తమ యంత్రాంగానికి స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు.ఈ స్పెషల్ డ్రైవ్ లో సీనియర్ జేటివో మహమ్మద్ జావిద్ తదితరులు పాల్గొన్నారు.స్థానిక నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అధికారుల వెంట నిలిచారు.

## మత్స్య సొసైటీల ఖాతాల్లో చేప,రొయ్య పిల్లల కొనుగోలు నిధులు జమ చేయాలి..

**మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో**

**కలెక్టరేట్ ఎదుట ధర్నా..**

**అధికారులకు వినతిపత్రం**




**మంచిర్యాల,జూలై20(సూర్యరేఖ)** ప్రభుత్వం చేప,రొయ్య పిల్లల కొనుగోలు కోసం ప్రతి మత్స్య సహకార సంఘం ఖాతాలో నేరుగా 100 శాతం సబ్సిడీతో నగదు జమ చేయాలని తెలంగాణ మత్స్యకారులు,మత్స్య కార్మిక సంఘం డిమాండ్ చేసింది.ఈ మేరకు సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి,మత్స్యశాఖ ఏఈవో,ఏడీకి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బోడెంకి చందు మాట్లాడుతూ...గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ పేరుతో టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లు,అధికారులకే లాభం చేకూరిందని ఆరోపించారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉచిత చేప పిల్లల పంపిణీకి బడ్జెట్ కేటాయించకుండా మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏడాది బడ్జెట్‌లో పెద్ద పెట్టుబడిదారులకు భారీ రాయితీలు కల్పిస్తున్నప్పటికీ,ప్రజలకు పోషకాహారం అందిస్తూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్న మత్స్యకారుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే జిల్లాలోని కార్పొరేషన్ పరిధిలో మూడు ఎకరాల స్థలంలో రూ.200 కోట్లతో 10హోల్‌సేల్ చేపల మార్కెట్లు,మున్సిపాలిటీలలో ఎకరా స్థలంలో రూ.100కోట్లతో రిటైల్ చేపల మార్కెట్లు,ప్రతి మండల కేంద్రంలో ఆధునిక చేపల మార్కెట్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన చెరువులు,కుంటల లీజులను రద్దు చేసి, జలవనరులు ఆక్రమణలకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని,మత్స్యకారులకు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను 90శాతం సబ్సిడీతో అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ధర్నాలో జిల్లా అధ్యక్షుడు మంచర్ల రాజేందర్, బోయరి రాజ్‌కుమార్,జూనియరి నారాయణ, గుమ్ముల శ్రీనివాస్,మొగుర్ల మహేష్,మల్లేష్, చంద్రశేఖర్,భూమయ్య,పిడుగు శ్రీనివాస్,సతీష్,రవి, చిలుకయ్య, సీహెచ్ రాజ్‌కుమార్,గగ్గూరు రాజన్న, నరేష్,మనోహర్ తదితర మత్స్యకార సంఘం నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి..

**టీపీసీసీ నేతలు**



**మందమర్రి,జూలై20(సూర్యరేఖ)**ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా,వేగవంతంగా పూర్తి చేయాలని టీపీసీసీ జిల్లా ఇన్‌చార్జి కొట్యానాయక్, టీపీసీసీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి బీఎల్‌ఓలకు సూచించారు.సోమవారం మందమర్రి పట్టణంలోని మూడో జోన్ రామాలయంలో 10పోలింగ్ కేంద్రాలకు చెందిన బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో నేతలు మాట్లాడుతూ...అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా బీఎల్‌ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు,ఇతర సవరణలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు.ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడంలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని, ప్రతి దరఖాస్తును నిష్పాక్షికంగా పరిశీలించి పారదర్శకంగా వ్యవహరించాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి,వనం నర్సయ్య, రాచర్ల గణేష్,ఎండీ ఇసాక్,వేణుగోపాల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు,బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

## కార్వాన్ ఎమ్మెల్యే కుమారుడి పెళ్లి వేడుకల్లో ప్రముఖుల శుభాకాంక్షలు



**నాంపల్లి,హైదరాబాద్,జూలై20(సూర్యరేఖ)** కార్వాన్ పరిధిలోగా కింగ్ క్లాసిక్ ఫంక్షన్ హాల్ యందు నిర్వహించిన కార్వాన్ నియోజకవర్గం శాసనసభ్యులు కౌసర్ మొహియుద్దీన్ కుమారుడు మహమ్మద్ జాఫర్ మొయినుద్దీన్ రిసెప్షన్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకల కార్యక్రమంలో కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయ బోనాల ఉత్సవ కమిటీ ఆలయ ఛైర్మెన్ అమర్ సింగ్,కార్వాన్ మరాఠా బస్తీ తుల్జాభవాని మాత ఆలయ చైర్మన్ పరమేశ్ తాండేకర్,కాంగ్రెస్ నాయకులూ పాశం రాజేందర్ యాదవ్,సునీల్ యాదవ్ తదితరులు పాల్గొని నూతన వరుడికి పెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

## కౌన్సిలర్ భర్తపై చర్యలు తీసుకోవాలి..


**డిసిసి ఎస్టీ సెల్ అధ్యక్షులు రెడ్డినాయక్**



**కామారెడ్డి,జూలై20(సూర్యరేఖ)** కామారెడ్డి బావర్చి హోటల్లో ఏడవ వార్డు కౌన్సిలర్ భర్త సురేందర్ హోటల్లో వర్క్ సూపర్వైజర్ గా చేస్తున్నాడు. సురేందర్ సూపర్వైజర్ ను ఏడవ వార్డు కౌన్సిలర్ భర్త బండబూతులు తిడుతూ స్నేహితులతోని వచ్చి వీళ్లు వచ్చి మా కులానికి కించపరిచే విధంగా బూతు మాటలతో తిట్టడం లంబాడి బిడ్డే పైన అరాచకంగా మాట్లాడి మరియు లంబాడి చూత్ లంబాడి అని వాడు మరి ఘోరంగా తిట్టి మన కులాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన. కౌన్సిలర్ భర్తపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్టిసెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డినాయక్ ఆలిండియా బంజారా సేవా సంఘం అధ్యక్షులు సురేందర్ రాథోడ్,ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ వినోద్ సోషల్ మీడియా ఇన్చార్జ్ ప్రకాష్ నాయక్ డిమాండ్ చేశారు. కౌన్సిలర్ భర్తపై కఠినంగా చర్య తీసుకుని అతనిపైన అట్రాసిటీ కేసు వేయాలని మన కామారెడ్డి జిల్లా తరఫున ఎస్టీ సేల్ అధ్యక్షులు రెడ్డినాయక్ డిమాండ్ చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన బీజేపీ బీఎల్ఏ-1 పోతగాని గోపాల్ గౌడ్





**నాచారం,జూలై20(సూర్యరేఖ)**కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ బీఎల్ఏ-1పోతగాని గోపాల్ గౌడ్ పరిశీలించారు.ఈ సందర్భంగా బూత్‌లను సందర్శించి ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించడంతో పాటు బూత్ లెవల్ అధికారుల (బీఎల్‌వోలు)నుంచి ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పారదర్శకంగా,సమర్థవంతంగా నిర్వహించబడేలా ప్రతి దశను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు.అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకుని అవసరమైన సవరణలు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ సుశీల సుజాత,సబితాయాదవ్,కే.యాదగిరి, రాజిరెడ్డి,బీఎల్‌వోలు, స్థానిక ఓటర్లు,బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాల హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆర్యవైశ్య సంఘం..



**శేరిలింగంపల్లి,జులై20(సూర్యరేఖ)**శేరిలింగంపల్లినియోజకవర్గం, మదీన గూడ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వాల హరీష్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలలో ముక్కా పృథ్వీ గుప్త ఆద్వర్యంలో మదినగూడ ఆర్యవైశ్య సంఘం సభ్యులు,జిల్లా ఆర్యవైశ్య నాయకులు డోగిపర్తి నాగమల్లేశ్వరరావు,గజవాడ లక్ష్మీనరసింహరావు, నూకల సుబ్రమణ్యం,రంగా,రమేష్,సంఘసభ్యులు కాలనీప్రముఖులు,నాయకులు విచ్చేసి వాలా హరీష్ రావుకు హృదయపూర్వకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## అధినేత అడుగుజాడల్లో నడుస్తూ పార్టీని బలోపేతం చేస్తా..

జనసేన నేత శ్రీనివాస్



**నిజామాబాద్,జులై20 (సూర్యరేఖ)**ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ నిజామాబాద్ జిల్లాలో పార్టీ బలోపేతా నికి తన వంతు కృషి చేస్తానని పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మీడియాతో మాట్లాడారు. 2014 పార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి సేవలు చేస్తూ జిల్లాలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని శ్రీనివాస్ తెలిపారు గత కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీఏలో భాగస్వామ్యం అయినందుకు ఓటర్లు భారతీయ జనతా పార్టీ వైపు మొగ్గు చూపారని శ్రీనివాస్ తెలిపారు.రాబోయే ఎన్నికల్లో బలమున్నచోట పోటీ చేసి నిలబడతామని శ్రీనివాస్ ప్రకటించారు.2014 నుండి పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జనసేన పార్టీ బలంగా ఉందని శ్రీనివాస్ చెప్పారు. పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మరియు జనసేన పార్టీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి గుండా సంతోష్ ఆధ్వర్యంలో పార్టీని ముందుకు నడిపిస్తున్నామన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం:

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి

ఘనంగా మంచాల,యాచారం మండలాల సంయుక్త సమావేశం..

జర్నలిస్టులు అందరికీ అక్రెడిటేషన్లు,హెల్త్ కార్డుల మంజూరుకై ప్రభుత్వంతో చర్చలు..

పాల్గొన్న రంగారెడ్డి జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సలీమ్ పాషా,మేకల సత్యనారాయణ



**మంచాల/యాచారం,జూలై20** జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే) నిరంతరం అండగా ఉంటుందని,సమస్యల సాధనలో రాజీలేని పోరాటం చేస్తుందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు.సోమవారం మంచాల,యాచారం మండలాల టీయూడబ్ల్యూజే సంయుక్త విస్తృత స్థాయి సమావేశం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం కాగజ్ ఘాట్ లోని సిరి నేచర్ వ్యాలీ రిసార్ట్ లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమిస్తూ, సమాజ శ్రేయస్సుకై పాటుపడుతున్న వర్కింగ్ జర్నలిస్టులకు కనీస సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లయిన అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్రెడిటేషన్ కార్డుల మంజూరు.కార్పొరేట్ వైద్యం అందేలా ఉచిత హెల్త్ కార్డుల పునరుద్ధరణ,అలాగే కుటుంబాలకు ధీమానిచ్చేలా గ్రూప్ ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా)సౌకర్యం కల్పించే విషయాలపై ఇప్పటికే యూనియన్ తరపున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని,వీటి సాధన వరకు ఒత్తిడి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.క్షేత్రస్థాయిలో జర్నలిస్టులంతా విభేదాలు వీడి,ఒకే తాటిపైకి వచ్చి యూనియన్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సలీం పాషా,ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణలు మాట్లాడుతూ...మండల స్థాయిలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, స్థానిక సమస్యలపై త్వరలోనే జిల్లా కలెక్టర్, సమాచార పౌరసంబంధాలశాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు తెలిపారు. జర్నలిస్టులపై ఎక్కడైనా దాడులు లేదా అక్రమ కేసులు జరిగితే యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందని, లీగల్ సెల్ ద్వారా వారికి పూర్తి న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.ప్రతి నియోజకవర్గం లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి,ఉపాధ్యక్షులు పాండుయాదవ్, పాండురంగారెడ్డి,సంయుక్త కార్యదర్శులు దారుగుపల్లి సత్యనారాయణ,ఆంజనేయులు, సూర్యనారాయణ,రమేష్,మాజీ జిల్లా అధ్యక్షులు ఆనంతుల శ్రీనివాస్,ఈ సీ సభ్యులు ఇలియాజ్ షరీఫ్,సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి,శ్రీనివాస్, పాండు,తదితరులు పాల్గొని జర్నలిస్టుల హక్కుల రక్షణకు స్థానిక కమిటీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో మంచాల, యాచారం మండలాల పరిధిలోని ప్రింట్,ఎలక్ట్రానిక్, మరియు డిజిటల్ మీడియా జర్నలిస్టులు,వివిధ పత్రికల విలేఖరులు,యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**టీయూడబ్ల్యూజే మంచాల మండల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక..**


**టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు కోటప్ప, ప్రధాన కార్యదర్శి రంజిత్,కోశాధికారిగా శాస్త్రి,వైస్ ప్రెసిడెంట్ మహేష్,మధుసూదన్ రెడ్డి ఎన్నికయ్యారు.**

**టీయూడబ్ల్యూజే యాచారం మండల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక..**

టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు పెంటయ్య, ప్రధానకార్యదర్శి మహేందర్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ గా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన కమిటీ జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం..

నేనేం తప్పు చేయలేదు.. వాట్సాప్ స్టేటస్ పెట్టిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి




**రాజేంద్రనగర్,జులై20(సూర్యరేఖ)** హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీ (ఎన్.పి.ఏ)లో తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపులు,దాడి చేసినట్లు వచ్చిన ఆరోపణల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది.ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు.ఇది గమనించి అతన్ని ఎర్రగడ్డలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి,చికిత్స అందిస్తున్నారు. కాగా,ఆత్మహత్యకు ముందు తన తప్పేమీ లేదని ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ స్టేటస్ పెట్టడం గమనార్హం..తనతోపాటు శిక్షణ పొందుతున్న తోటి ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఈ ఏడాది జూన్ 23నుంచి తనను లైంగికంగా వేధిస్తున్నాడని, వాట్సాప్ ద్వారా అసభ్యకర మెసేజ్‌లు పంపి బూతులు తిడుతున్నాడని ఓ ట్రైనీ ఐపీఎస్ అధికారిణి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఉదయ్ కృష్ణారెడ్డి రహస్యంగా తన వ్యక్తిగత ప్రైవేట్ వీడియోలను చిత్రీకరించి తీవ్రంగా బెదిరిస్తున్నాడని,ఆ వీడియోలను తన భర్తకు పంపి మానసికంగా వేధించడంతోపాటు వాటిని సోషల్ మీడియాలో పెడతానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల తనను బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి ప్రైవేట్ భాగాలను తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడటంతోపాటు చంపేందుకు ప్రయత్నించాడని, మెడపై కత్తి పెట్టి ఆ గది నుంచి బయటకు వెళ్లకుండా నిర్బంధించాడని ఆ అధికారిణి ఆరోపించారు.దీంతో ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని74,75,77,78,79,127(2), 115(2),351(2) సెక్షన్లతోపాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని 66ఈ,67ఏ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న అధికారులు..ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మహిళా ఐపీఎస్ ట్రైనీ చేసిన ఆరోపణలు నిజమని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది.ఈ కమిటీ నిర్ణయంతో జాతీయ పోలీస్ అకాడమీ నుంచి ఉదయ్ కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు.దీంతో మనస్తాపానికి గురైన ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు.దీనికి ముందు తన తప్పేమీ లేదంటూ వాట్సాప్‌లో స్టేటస్ పెట్టాడు. ఇప్పుడు ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది ఉదయ్ కృష్ణారెడ్డి ఐపీఎస్ జర్నీ కూడా తెలుగు రాష్ట్రాల్లో చాలామందికి ఆదర్శంగా నిలిచిన వ్యవహారం.సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామానికి చెందిన ఉదయ్..తల్లిదండ్రులు లేకపోవడంతో నానమ్మ కూలిపనులు చేసి తెచ్చే డబ్బుతోనే వారి జీవనం సాగింది.ఆ కసితోనే 2013లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. అయితే ఓ సీఐ తోటివారి ముందు అవమానించడంతో.. 2018లో ఉద్యోగానికి రిజైన్ చేసి..సివిల్స్ బరిలోకి దిగాడు.నాలుగుసార్లు విజయం దక్కకపోయినా. .పట్టుదలతో ఐదోసారి360 ర్యాంకుతో ఐపీఎస్ సాధించాడు.త్వరలో పూర్తి స్థాయి పోలీస్ అధికారిగా బాధ్యతలు చేపట్టాల్సిన అతను..ఇప్పుడు ఇలా ఆరోపణలతో ఆత్మహత్యాయత్నం వరకు వచ్చాడు.

## భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన..



**శేరిలింగంపల్లి,జులై20(సూర్యరేఖ)** భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నానని,నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతులు కల్పిస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే,పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీ అన్నారు.ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళినగర్ కాలనీలో రూ.రూ.48.5లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణ పనులకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్,జలమండలి అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ...భూగర్భడ్రైనేజి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని,పలు కాలనీలలో ప్రజల నుండి వచ్చిన వినతి మేరకు,అలాగే మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో అల్వీన్ కాలనీ డివిజన్ లో అభివృద్ధి పనులు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గాంధీ అన్నారు.కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతూ సమస్య రహిత,ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే తమ ప్రథమ లక్ష్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు జీఎం హరిశంకర్,డీజీఎం శ్రీనివాస రాజు,మేనేజర్ అనిల్,నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,కాలనీ వాసులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో ప్రతి ఒక్క ఓటరు పాల్గొనాలి..

**సర్ ఎన్యుమరేషన్‌పై క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించిన మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్**



**శేరిలింగంపల్లి,జులై20(సూర్యరేఖ)** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ డివిజన్ పరిధిలో ఎన్యుమరేషన్ కేంద్రాలకు కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించటం జరిగింది. ఈ పరిశీలన సందర్భంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం,వివరాలను సేకరించడం,ఓటర్లతో సమన్వయంను నిర్వహిస్తున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, అయోమయాలకు తావు లేకుండా చూడాలని సూచించారు. డివిజన్ పరిధిలో వివిధ పోలింగ్ స్టేషన్లలో ఎన్యుమరేషన్ పనుల పురోగతిని సమీక్షించారు. ఇప్పటివరకు సేకరించిన ఫారాల సంఖ్య, పెండింగ్‌లో ఉన్న ఇళ్ల వివరాలను బీఎల్ఓలను నుంచి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా 100శాతం కవరేజ్ సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బీఎల్ఓలు ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని,వారికి ఎదురవుతున్న సమస్యలు,ప్రజల నుంచి వస్తున్న సందేహాలు తెలుసుకుని అవసరమైన మార్గదర్శకాలు అందించాలని బీఎల్ఓలకు సూచించారు. సేకరించిన దరఖాస్తులను అదే రోజు డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని బీఎల్ఓలకు,సూపర్వైజర్లకు ఈ సందర్భంగా సూచించారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా పాల్గొని ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియకు సహకరించాలని కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని,సరైన వివరాలతో ఓటరు జాబితా సిద్ధమైతే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఇంటింటికీ వచ్చే బూత్ లెవల్ అధికారులు (బ్లాక్)లకు అవసరమైన సమాచారం,పత్రాలు అందించి సహకరించాలని కోరారు. అలాగే పేరు,చిరునామా,వయస్సు తదితర వివరాల్లో మార్పులు ఉంటే వాటిని ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా సరిచేసుకోవాలని సూచించారు .ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హమీద్ పటేల్ పిలుపునిచ్చారు.

## పిల్లలు ఆడుకునే స్థలంలో ప్రమాదకర విద్యుత్ స్తంభం తొలగింపు:

**లైన్‌మన్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు**



**మాసాయిపేట,జూలై20(సూర్యరేఖ)** చెట్లతిమ్మాయిపల్లి గ్రామపంచాయతీ పులిగుట్ట తండాలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ స్తంభాన్ని విద్యుత్ శాఖ అధికారులు సోమవారం తొలగించారు. తండాలో చిన్నపిల్లలు ఆడుకునే ప్రాంతానికి సమీపంలోనే ఈ ట్రాన్స్ఫార్మర్ స్తంభం ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక లైన్‌మన్ యాదగిరి తక్షణమే స్పందించారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి,ఆ ప్రమాదకర స్తంభాన్ని అక్కడి నుండి తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అంశీ మనోహర్ మాట్లాడుతూ...ప్రజల ప్రాణాలను, ముఖ్యంగా చిన్నపిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకొని,ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన లైన్‌మన్ యాదగిరికి తండావాసులు,రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రమాదాన్ని ముందే పసిగట్టి నివారించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంశీ మనోహర్‌తో పాటు భానోత్ శ్రీకాంత్,మాలోత్ భాస్కర్,విట్టల్ నాయక్,మాలోత్ రవి,సురేష్, కేతావత్ జవి,లాలీ,జామల్లి మరియు తండా గ్రామస్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

## అతి వేగమే యువ విద్యార్థి ప్రాణాలు తీసింది..

**యాప్రాల్‌లో కారు బోల్తా;చికిత్సకు తరలిస్తుండగా వరుణ్ మృతి**



**కీసర/జవహర్‌నగర్,జూలై20(సూర్యరేఖ)** అతి వేగంగా కారు నడపడం ఓయువ విద్యార్థి ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన యాప్రాల్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం,శ్రీ నలిన్ మోహన్ ఫిర్యాదు మేరకు ఆయన కుమారుడు వెల్లంగులం వరుణ్ (22),విద్యార్థి,జూలై 19సాయంత్రం తన స్నేహితులను కలిసేందుకు సైనిక్‌పురికి వెళ్లాడు. అనంతరం జూలై20 తెల్లవారుజామున సుమారు 4గంటల సమయంలో హెచ్ పి37డి1736 నంబరు గల వెంటో కారులో ఇంటికి తిరిగి వస్తుండగా యాప్రాల్‌లోని ఓంశ్రీ సిగ్నెట్ అపార్ట్‌మెంట్స్ సమీపంలో అతి వేగంగా వాహనం నడపడం వల్ల అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న ఇంటి ముందు వాలును ఢీకొని కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వరుణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న అలి,అరుణ్‌లకు స్వల్ప గాయాలు కాగా,స్నేహితులు వరుణ్‌ను మరో కారులో చికిత్స నిమిత్తం మిలిటరీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్ఐని కలిసిన మాజీ ఎంపీపీ..




**కామారెడ్డి,జూలై20(సూర్యరేఖ)** కామారెడ్డి నియోజకవర్గం బిక్నూరు ఎస్సై అనిల్ కుమార్ ను సోమవారం బిక్నూర్ మండల మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్ మర్యాదపూర్వకంగా కలిశారు శాంతి భద్రతల కోసం తమ వంతు కృషి చేస్తానని ఎస్ఐకి మాజీ ఎంపీపీ సుదర్శన్ తెలిపారు. ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ...దొంగతనాల నివారణకు గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై మాజీ ఎంపీపీ సుదర్శన్ ను కోరారు. అందుకు సుదర్శన్ సానుకూలంగా స్పందించి గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేశానని సుదర్శన్ తెలిపారు.

## ఇల్లెందులో ఫిజియోథెరపీ ఆస్పత్రి ఏర్పాటుపై ఎమ్మెల్యే కోరం కనకయ్యకు డాక్టర్ బాధావత్ రవి వినతి పత్రం..

**ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తా..ఎమ్మెల్యే**



**కారేపల్లి,జూలై20(సూర్యరేఖ)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్యను ప్రముఖ వైద్యుడు, మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకు డు డాక్టర్ బాధావత్ రవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇల్లెందు ప్రాంతంలో ఫిజియోథెరపీ ఆస్పత్రి ఏర్పాటు అవసరంపై ఎమ్మెల్యేతో చర్చించారు. డాక్టర్ బాధావత్ రవి మాట్లాడుతూ... నియోజకవర్గంలోని పేద ప్రజలు,చిన్నారులు, పక్షవాతం బాధితులు మరియు ప్రమాదాల బారిన పడిన రోగులు ఫిజియోథెరపీ చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లే ఆర్థిక స్థోమత లేని కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇల్లెందులోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్యను కోరారు. అలాగే ఇటీవల ఇల్లెందుకు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను తీసుకురావడంలో ఎమ్మెల్యే చేసిన కృషిని అభినందించిన డాక్టర్ రవి, ఇదే తరహాలో ఫిజియోథెరపీ ఆస్పత్రి ఏర్పాటుకు కూడా ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఫిజియోథెరపీ ఆస్పత్రి ఏర్పాటుతో స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడంతో పాటు యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య,ఫిజియోథెరపీ ఆస్పత్రి ఏర్పాటు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. డాక్టర్ బాధావత్ రవి చేసిన వినతిపై సానుకూలంగా స్పందించిన ఆయన,ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సానుకూల స్పందనకు డాక్టర్ బాధావత్ రవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ వాక్ ఫౌండేషన్ సభ్యులు నరేష్,షరీఫ్, రంగా,శ్రీను, సాయి,అజయ్,దేవా,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మరిపెడ పశు వైద్యశాలను సందర్శించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి



**మరిపెడ,జూలై20(సూర్యరేఖ)** మరిపెడ పట్టణంలోని ప్రభుత్వ పశు వైద్యశాలను సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని మౌలిక సదుపాయాలను పరిశీలించి,పశుపోషకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, పరిశుభ్రత,సౌకర్యాలపై ఆరా తీసి,పశుపోషకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని సూచించారు. పశువుల ఆరోగ్యం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమని,పశు వైద్యశాలలో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. పశు వైద్యురాలు శ్రీరమణి ఆసుపత్రిలో ప్రస్తుతం అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సలు,టీకాల కార్యక్రమాలు,రోజువారీగా వచ్చే కేసుల వివరాలను ఛైర్‌పర్సన్‌కు వివరించారు. పశుపోషకులకు అవసరమైన సేవలను నిరంతరం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మెరుగు రాము,పశు వైద్యురాలు శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.

## పోలంపల్లి నూతన సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన సత్యగౌడ్

**కలెక్టర్ ఆదేశాలతో బాధ్యతల అప్పగింత:**

**గ్రామ అభివృద్ధికి శ్రమిస్తానని వెల్లడి**



**చేగుంట,జూలై20(సూర్యరేఖ)**పోలంపల్లి గ్రామ నూతన సర్పంచ్‌గా సత్యగౌడ్ సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గ్రామ కార్యదర్శి వెంకటేష్ అధికారికంగా వెల్లడించారు. ఇటీవల పోలంపల్లి గ్రామ సర్పంచ్‌గా ఉన్న కొండి రాజ్యలక్ష్మి కొన్ని కారణాల వల్ల సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలో గ్రామ పాలన కుంటుపడకుండా ఉండేందుకు గానూ,జిల్లా కలెక్టర్ జారీ చేసిన ప్రత్యేక ఆదేశాల మేరకు సత్యగౌడ్‌కు సర్పంచ్ బాధ్యతలను అప్పగించినట్లు కార్యదర్శి తెలిపారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు గ్రామ అభివృద్ధియే నా ధ్యేయం.. సత్యగౌడ్ ఈ సందర్భంగా నూతన సర్పంచ్ సత్యగౌడ్ మాట్లాడుతూ...తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన అధికారులకు,మద్దతు తెలిపిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పరిరక్షణ కోసం,ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడతానని ఆయన హామీ ఇచ్చారు. పోలంపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచి,ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు, అభివృద్ధి దిశగా పయనించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది,వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## రైతులను బ్లాక్ మెయిల్ చేస్తున్న బినామీ పేరుతో వీఆర్ఏ విధులా.?

**సమగ్ర విచారణ చేపట్టాలని రైతుల డిమాండ్**



**కారేపల్లి,జూలై20(సూర్యరేఖ)**మండల తహసీల్దార్ కార్యాలయంలో బినామీ పేరుతో వీఆర్ఏ విధులు నిర్వహిస్తున్నారం టూ ఆరోపిస్తూ రెండు గ్రామపంచాయతీలకు చెందిన రైతులు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి,ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్లోజి శ్రీనివాస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. రైతులు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం...రెవెన్యూ సంబంధిత పనుల విషయంలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తు న్నారని,అధికార పరిధి లేకుండానే జోక్యం చేసుకుంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ అంశంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్యకు విజ్ఞప్తి చేశారు. విన తిపత్రం సమర్పించిన అనంతరం రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి నినాదాలు చేశారు. తమ ఫిర్యాదును అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలతి కిషోర్,గుజ్జర్లపూడి సైదులు,పాటి రమేష్, పాటి రంగయ్య,మాలస్వామి, పోతుల సత్యం, పోతుల వెంకటేశ్వర్లు,కొండం వెంకటేశ్వర్లు,పాటి రామ య్య,తదితర రైతులు పాల్గొన్నారు.

# దళిత--గిరిజన గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి..

**ఎస్సీ--ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేయాలి :**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు**



**కారేపల్లి,జూలై20(సూర్యరేఖ)** సింగరేణి మండలంలోని దళిత,గిరిజన ఆవాస ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని,ఎస్సీ--ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం కేటాయించిన నిధులను తక్షణమే విడుదల చేసి ఆయా ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి మండలంలోని దళిత,గిరిజన ఆవాస ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో పలు కీలక సమస్యలు వెలుగులోకి వచ్చాయని ఆయన తెలిపారు.గ్రామాల్లో తాగునీరు,అంతర్గత రహదారులు ,డ్రైనేజీ, విద్యుత్,గృహాలు,విద్య,వైద్యం వంటి మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందన్నారు.భూమిలేని వ్యవసాయ కార్మికులు ఉపాధి హామీ చట్టంలో మార్పుల కారణంగా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.దళిత,గిరిజన ఆవాస ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని,ఎస్సీ--ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఎలాంటి జాప్యం లేకుండా విడుదల చేసి,వాటిని పూర్తిగా దళిత,గిరిజన ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని కోరారు.ఎస్సీ,ఎస్టీల సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అంతోదయ అన్నపూర్ణ కార్డుల ద్వారా 35కిలోల బియ్యం పొందుతున్న పేద దళిత,గిరిజన కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం కార్డులను రద్దు చేసే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసిన లబ్ధిదారులకు ఇప్పటికీ చివరి బిల్లులు చెల్లించలేదని,అలాగే కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్)కింద విడుదల చేయాల్సిన రూ.60 వేల ప్రోత్సాహకాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.దళిత,గిరిజన కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుని,వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు.

# ఢిల్లీలో విద్యార్థులపై టియర్ గ్యాస్,లాఠీచార్జి దారుణం..

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి:**

**పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వి.రాకేష్**



**కారేపల్లి,జూలై20(సూర్యరేఖ)** ఢిల్లీలో శాంతియుతంగా "ఛలో పార్లమెంట్" కార్యక్రమానికి వెళ్తున్న విద్యార్థులు,యువతపై ఢిల్లీ పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్)రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వి.రాకేష్ పేర్కొన్నారు.సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ...నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ కారణంగా నష్టపోయిన విద్యార్థులకు తక్షణమే న్యాయం చేయాలని,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.విద్యార్థులు గత కొన్ని రోజులుగా ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షపై ప్రభుత్వం స్పందించకుండా, చర్చలకు ముందుకు రాకుండా పోలీసు బలగాలతో దీక్షను భంగపరచడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని రాకేష్ అన్నారు.దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలపై స్పందించాల్సిన ప్రభుత్వం నిరసనలను అణచివేసే చర్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించిన ఆయన,విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధానాలు అవలంబిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం,ప్రజాస్వామ్య గొంతుకలను అణచివేయడం సరికాదన్నారు. నీట్ పేపర్ లీక్‌తో నష్టపోయిన ప్రతి విద్యార్థికి న్యాయం జరిగే వరకు ఉద్యమాలు కొనసాగుతాయని స్పష్టం చేసిన రాకేష్,ఢిల్లీలో విద్యార్థులు,యువతపై టియర్ గ్యాస్ ప్రయోగించి లాఠీచార్జి చేయడాన్ని విద్యార్థులు,మేధావులు, ప్రజాస్వామ్యవాదులు,ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.

## డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటానికి విస్తృత మద్దతు..

**టియుసిఐ రాష్ట్ర కార్యవర్గం సంపూర్ణ నైతిక మద్దతు ప్రకటింపు..**

**జూలై 26సదస్సు విజయవంతానికి కరపత్రాల ఆవిష్కరణ,పదో రోజు పాదయాత్ర**







**హైదరాబాద్ సిటీ,జూలై20(సూర్యరేఖ)** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,కీసర సర్కిల్ పరిధిలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటానికి వివిధ ప్రజా సంఘాలు,రాజకీయ నాయకుల నుంచి మద్దతు పెరుగుతోంది.టియుసిఐ రాష్ట్ర కార్యవర్గం డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఐక్యంగా కదిలించి బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చింది.సోమవారం కీసర సర్కిల్ పరిధిలోని నీలం రాంచంద్రయ్య భవన్‌లో టియుసిఐ రాష్ట్ర నాయకుడు,పోరాట కమిటీ కో-కన్వీనర్ వి.ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జూలై 26న డి.ఎన్.ఆర్.ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే డంపింగ్ సమస్యపై అవగాహన సదస్సుకు సంబంధించిన కరపత్రాలను పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి,కన్వీనర్ ఉమామహేష్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా టియుసిఐ రాష్ట్ర నాయకులు ఎస్.ఎల్.పద్మ,సూర్యం జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటానికి తమ సంపూర్ణ నైతిక మద్దతు ప్రకటించారు.ఇదే సందర్భంగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో పదో రోజు అవగాహన పాదయాత్ర బాలాజీనగర్ ఫైరింగ్ రేంజ్ నుంచి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్,బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వరకు బాషవోని కొండల్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మేయర్ మేకల కావ్య మాట్లాడుతూ...ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి ముప్పుగా మారిన డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించాలనే డిమాండ్‌తో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ప్రభావిత ప్రాంతాలకు ఉచిత మంచినీటి సరఫరా,ఆస్తి పన్ను మాఫీ,చెత్త లారీల వల్ల దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజీలు,వీధి దీపాల పునరుద్ధరణ వంటి అంశాలను అసెంబ్లీలో ప్రస్తావించారని గుర్తుచేశారు. డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో వివిధ రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలు,కార్మిక సంఘాల ప్రతినిధులు,మహిళా సంఘాల నాయకులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం..

**తీవ్రంగా ఖండించిన సింగరేణి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్**



**కారేపల్లి,జూలై20(సూర్యరేఖ)** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు,యువత వ్యక్తం చేస్తున్న ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయంలో,ఢిల్లీలో "మార్చ్ టు పార్లమెంట్" పేరుతో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం,టియర్ గ్యాస్ ప్రయోగించడం అత్యంత దురదృష్టకరమైన, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని సింగరేణి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్‌లి తీవ్రంగా ఖండించారు.సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ...రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని,ముఖ్యంగా దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ఆందోళన చేపడితే,వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.అలాంటి పరిస్థితుల్లో వారిపై బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు.నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు,పేపర్ లీకేజీ ఆరోపణలతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారని,వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు.ఈ అంశంపై పారదర్శకంగా స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం,సమస్యను పరిష్కరించే బదులుగా ప్రశ్నిస్తున్న విద్యార్థుల గొంతును అణిచివేయడానికి పోలీసు వ్యవస్థను వినియోగించడం తీవ్రంగా ఖండనీయమని విమర్శించారు .ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలు,నిరసనలు సహజమని,వాటిని అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని ఆయన స్పష్టం చేశారు.విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని,గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని,నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర,పారదర్శక దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గుగులోత్ హర్ష నాయక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఎంపీ వంశీకృష్ణ పర్యటనకు అడ్డంకులు సృష్టించడం తగదు..

**దళిత రత్న రాజేష్ కుమార్**



**మందమర్రి, జూలై20(సూర్యరేఖ)**పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పర్యటనను అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ నాయకుడు,దళిత రత్న రాజేష్ కుమార్ విమర్శించారు.సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఎంపీ స్వాగతం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేయడం బాధ్యతారాహిత్య చర్య అని పేర్కొన్నారు.ఈ నెల 18న దండేపల్లి మండలం గూడెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠశాల బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపీ గడ్డం వంశీకృష్ణ వెళ్తున్న సమయంలో,గ్రామ సమీపంలో కొందరు వ్యక్తులు కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తూ నినాదాలు చేశారని తెలిపారు.అదే సమయంలో స్వాగత ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం దురదృష్టకరమని అన్నారు.ప్రజల ఓట్లతో ఎన్నికైన పార్లమెంట్ సభ్యుడికి తన నియోజకవర్గ పరిధిలోని గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకునే పూర్తి హక్కు ఉందని రాజేష్ కుమార్ స్పష్టం చేశారు.విద్యార్థులకు సేవా కార్యక్రమంగా బ్యాగులు పంపిణీ చేసేందుకు వచ్చిన ఎంపీ పర్యటనకు ఆటంకం కల్పించడం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీసు అధికారులను ఆయన కోరారు.

# రోజులు గడుస్తున్నా కదలని పీసీబీ..ప్రకటనలకే పరిమితమైన అధికారులు.!

'సిబ్బంది కొరత ఉందంటూ' పీసీబీ ఈఈ సమాధానం..ఆందోళనలో రైతులు

ఇంకా క్షేత్రస్థాయికి రాని టాస్క్‌ఫోర్స్ బృందాలు.. సేకరించని రసాయన నమూనాలు

చంద్రంచాల్ పరిశ్రమ కాలుష్యంపై చిన్నశివనూర్ గ్రామస్తుల నిరీక్షణ..







**చేగుంట,జూలై20(సూర్యరేఖ)**చిన్నశివనూర్ గ్రామంలోని 'చంద్రంచాల్ ఎంటర్‌ప్రైజ్ ప్రైవేట్ లిమిటెడ్'పరిశ్రమ రసాయన వ్యర్థాల వల్ల భూగర్భజలాలు,పంట పొలాలు కలుషితమవుతున్నాయంటూ 'సూర్యరేఖ' దినపత్రికలో కథనం ప్రచురితమై17 రోజులు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పర్యవేక్షణ చర్యలు ముందుకు సాగడం లేదు.పరిశ్రమ నుండి వెలువడే రసాయన ద్రవాలు,ఇండస్ట్రియల్ ఆయిల్లను కాంక్రీట్ గోడల కింద నుండి పక్కనే ఉన్న ఖాళీ భూముల్లోకి వదులుతుండటంపై జూలై 03న 'సూర్యరేఖ'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు.జూలై 09న కాలుష్య నియంత్రణ మండలి టీజీపీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ (ఈఈ)ఎస్.మాధురి మాట్లాడుతూ...ల్యాబ్,టాస్క్‌ఫోర్స్ బృందాలను తక్షణమే పంపి నమూనాలు సేకరిస్తామని తెలిపారు.అలాగే చేగుంట ఎంపీడీఓ బి.చెన్నారెడ్డి కూడా పరిశ్రమ యాజమాన్యానికి తక్షణమే నోటీసులు జారీ చేసి వివరణ కోరతామని ప్రకటించారు.

**సిబ్బంది కొరత సాకుతో కాలయాపన.?:**

సమస్య వెలుగులోకి వచ్చి 17రోజులు,అధికారులు తనిఖీ చేస్తామని చెప్పి 10రోజులు గడుస్తున్నా ఇంతవరకు కాలుష్య నియంత్రణ మండలి నుండి ఎలాంటి బృందాలు క్షేత్రస్థాయికి రాలేదు,కనీసం రసాయన నీటి నమూనాలను కూడా సేకరించలేదు. దీనిపై 'సూర్యరేఖ' ప్రతినిధి సోమవారం టీజీపీసీబీ ఈఈ ఎస్.మాధురిని ఫోన్ ద్వారా వివరణ కోరగా ఆమె స్పందిస్తూ ప్రస్తుతం స్టాఫ్ తక్కువగా ఉన్నారని, త్వరలోనే బృందాలను పంపి నమూనాలు సేకరిస్తాం అని బదులిచ్చారు.పర్యావరణ సమస్యలపై అధికారులు ఇలా సిబ్బంది కొరతను సాకుగా చూపుతూ కాలయాపన చేయడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**రైతుల ఆందోళన..**

నిరంతరం రసాయనాలు భూమిలోకి ఇంకిపోతుండటంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు కలుషితమై,భవిష్యత్తులో వ్యవసాయ భూములు దెబ్బతినే ప్రమాదం ఉందని చిన్నశివనూర్ గ్రామస్తులు,చుట్టుపక్కల రైతులు ఆందోళన చెందుతున్నారు.అధికారులు కేవలం మాటలతో కాలయాపన చేయకుండా,తక్షణమే స్పాట్‌కు బృందాలను పంపించి శాంపిల్స్ సేకరించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధే ప్రధాన ఎజెండా..





**కోట్ల నిధులతో అభివృద్ధికి చొరవ..**

**రూ.90.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాల శంకుస్థాపనలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,జులై20(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రధాన ఎజెండాగా పని చేయడం జరుగుతుందని నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అన్ని రకాలుగా చొరవ చూపుతున్నామని తెలిపారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా సోమవారం పలు ప్రధాన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఘనంగా శంకుస్థాపన చేశారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొత్తం రూ.90.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టారు.రూ.67.80 లక్షల వ్యయంతో రాజేంద్రనగర్ డివిజన్ న్యూగ్రీన్ సిటీ కాలనీ వార్డ్ నెంబర్ 120లో నూతన సీసీ రోడ్డు నిర్మాణం,రూ.22.40 లక్షల వ్యయంతో రాజేంద్రనగర్ డివిజన్లోని బుద్వేల్ సిగ్నేచర్ అపార్ట్మెంట్ సమీపంలో వార్డ్ నెంబర్ 120లో మరో సీసీ రోడ్డు నిర్మాణాలకు టి.ప్రకాష్ గౌడ్ గారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...నియోజకవర్గంను ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందని వివరించారు.నియోజకవర్గంలో వాడవాడల అభివృద్ధి పనులు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఇప్పటివరకు విడుదలైన నిధులతో అభివృద్ధి పనులను చేపట్టడంతో పాటు నూతనంగా అవసరమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకుగాను నిధుల విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే ఎట్టి పరిస్థితిలోనూ సహించేది లేదన్నారు. అధికారులు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పలుగు చెరువు మహేష్,పడమటి శ్రీధర్ రెడ్డి,రగడంపల్లి శ్రావణ్, పెండ్యాల శ్రీధర్,అధికారులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## నేడు కిస్మత్పూర్ సెక్షన్ల విద్యుత్ సరఫరాలలో అంతరాయం..



**బండ్లగూడ,జూలై20(సూర్యరేఖ)** కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. మధ్యాహ్నం 02:30 నుండి 04:30 వరకు స్నేహిత హిల్స్ సబ్-స్టేషన్ నుండి వచ్చే పి డటి కాలనీ ఫీడర్ పై విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. ఆదర్శనగర్,బైరాగిగూడ,భవానికాలనీ ,బండ్లగూడ గ్రామం, చెవెల్ల,చింతల్‌మెట్ టవర్స్,సిటి మీటర్స్, హిమాయత్‌సాగర్,డిడికాలనీ,గండంగూడ,హిమాగిరికాలనీ, హెచ్‌వి బండ్లగూడ, హెచ్‌వినెట్, మీటర్స్,హెచ్‌వి పిడటి సన్ సిటీ,హైదర్షకోటే, జెఎల్‌ఎన్‌ఎస్ కాలనీ,కాలికానగర్,కపిల్ నగర్ పిడటి కాలనీ,పిడటి కాలనీ సి-బ్లాక్,పేరంచెరు,రాధానగర్, ఆర్జిజిఐ గృహ (పీరంచేరు),సాయి హర్షకాలనీ,సాయిరాంనగర్ కాలనీఎస్ఎంఆర్బిల్డర్స్,శ్రీనివాస్ నగర్ కాలనీ,స్టల్ మరియు పిడబ్ల్యూఎస్ గంధంగూడ,సన్‌సిటీ, విద్యపీఠం,వికాస్ నగర్, మొదలైనవి మరియు ఉదయం10:00 నుండి.వరకు 12:00 పీఎం.నిర్వహణ,చెట్లు నరికే పనుల నిమిత్తం,11కేవీ రాక్ చర్చ్ ఫీడర్ ప్రభావిత ప్రాంతాలైన శ్రీసాయికాలనీ,ప్రభుత్వ పాఠశాల, రాఘువేంద్రకాలనీ,ఫైనర్స్ కాలనీ,ఎన్ఆర్ఐ టౌన్‌షిప్,రాధా రియల్టీ,వివేకానంద కాలనీ,యాదాద్రికాలనీ,ఓంనగర్ కాలనీ,ఎస్ఎం ఎన్క్లేవ్ 1౬2,సిఎల్ విల్లాస్, పూజా విల్లాస్,రాక్ చర్చ్ఉకృతి విల్లాస్ మొదలైన వాటిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది.

## బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ఫిర్యాదు..




**బెల్లంపల్లి,జూలై20(సూర్యరేఖ)**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తూ,అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సన్నీబాబు ఆధ్వర్యంలో బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా వ్యవహరించే వారిని ఉపేక్షించవద్దని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డుపై వరి నాట్లు.. బీఆర్ఎస్ నేతల వినూత్న నిరసన




**మేడ్చల్,జూలై20(సూర్యరేఖ )**మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మేడ్చల్ డివిజన్‌లో ప్రధాన రహదారుల దుస్థితిని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం వినూత్నంగా రోడ్డుపై వరి నాట్లు వేసి ఆందోళన చేపట్టారు.రోడ్లపై ఏర్పడిన భారీ గుంతలు వర్షపు నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయని,దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మేడ్చల్ వివేకానంద స్టార్చ్ నుంచి గ్రంథాలయం వెళ్లే రహదారిపై డ్రైనేజీ మూతలు పగిలిపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేతలు తెలిపారు.నెలల తరబడి సమస్య కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు,ఉద్యోగులు,స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగామారిందన్నారు.వెంటనే రహదారులను మరమ్మతు చేయడంతో పాటు పాడైన డ్రైనేజీ మూతలను మార్చి ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ గ్రంథాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్, దయానంద్ యాదవ్,ఆకిటి నవీన్ రెడ్డి, సందీప్ గౌడ్,నాగరాజు,శంకర్ ముదిరాజు, మహిళలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వరం..

**రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్**




**రాజేంద్రనగర్,జులై20(సూర్యరేఖ)**పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు వరమని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు.కాంగ్రెస్ పాలనలో ప్రతి పేదవాడికి న్యాయం జరిగిందని వివరించారు.తెలంగాణ సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రారంభోత్సవం నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో ఎల్ఐజి గృహ నిర్మాణ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు.మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,దుద్దిల్ల శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్ గౌడ్,మహమ్మద్ అజహరుద్దీన్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వారితో కలిసి పాల్గొని,పేదల సొంతింటి కలను నెరవేర్చే ఈ బృహత్తర పథకం ప్రారంభోత్సవంలో భాగస్వాములయ్యారు.ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపి.గౌతం తదితర అధికారులు పాల్గొన్నారు.

# శిథిల కల్వర్టుపై నూతన రోడ్డు...ప్రజల ప్రాణాలతో చెలగాటమా.

**నత్తనడకన సాగుతున్న పనులు..నిబంధనలకు నీళ్లు**
**మట్టిలో కలిసిన మత్తడి కాలువలు..నీరందక రైతుల ఆవేదన**
**మసి పూసి మాయ చేస్తున్న కాంట్రాక్టర్**
**అధికారుల మౌనంపై మండిపడుతున్న ప్రజలు**









**మందమర్రి,జూలై20(సూర్యరేఖ)** ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించాల్సిన రహదారి అభివృద్ధి పనులు ఇప్పుడు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.పూర్తిగా శిథిలావస్థకు చేరిన కల్వర్టును తొలగించి కొత్తగా నిర్మించాల్సిన చోట, అదే కల్వర్టుపై రోడ్డు నిర్మాణం చేపట్టడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.మందమర్రి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కారణంగా ఇదే మార్గంలో భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతుండటం తో ఎప్పుడు కల్వర్టు కూలిపోతుందోనన్న భయంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు.మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని కాళీనగర్ క్రాస్ రోడ్ నుంచి ఊరు రామకృష్ణాపూర్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు చేపట్టిన సుమారు రెండు కిలోమీటర్ల రహదారి విస్తరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా విస్మరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రహదారి నిర్మాణానికి ముందు కల్వర్టులను పునర్నిర్మించడం, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం వంటి ప్రాథమిక నిబంధనలను పక్కనబెట్టి పనులు కొనసాగించడం ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.వర్షాలు కురిస్తే రోడ్డు కుంగిపోవడం, కల్వర్టు కూలిపోవడం ఖాయమని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

**నత్తనడకన సాగుతున్న పనులు..నిబంధనలకు నీళ్లు**

నెలల క్రితం ప్రారంభమైన రహదారి పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సింగరేణి కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు,గ్రామస్తులు కంకరతో నిండిన రహదారిపై నిత్యం ప్రయాణిస్తూ ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.రోడ్డు నిర్మాణంలో క్యూరింగ్ ప్రక్రియను సక్రమంగా చేపట్టకపోవడం, బీటీ పనులను ఆలస్యం చేయడం కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపిస్తున్నారు.

**మట్టిలో కలిసిన మత్తడి కాలువలు..నీరందక రైతుల ఆవేదన**

రోడ్డు పనుల పేరుతో చెరువు మత్తడి కాలువలను మట్టితో పూడ్చివేయడం రైతుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.దశాబ్దాలుగా అదే నీటిపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు ఇప్పుడు సాగునీరు పూర్తిగా నిలిచిపోయింది.ఊరు రామకృష్ణాపూర్‌కు చెందిన రైతు అందుగుల చిన్న మల్లేష్ మాట్లాడుతూ...కాలువలు మూసివేయడంతో తమ పొలాలకు చుక్క నీరు కూడా చేరడం లేదని, పంటలు ఎలా సాగు చేయాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అభివృద్ధి పేరుతో తమ జీవనాధారాన్ని నాశనం చేశారని రైతులు మండిపడుతున్నారు.

**రైతుపై కాంట్రాక్టర్ హుకుం..!**

రోడ్డు విస్తరణలో ఒకవైపు విద్యుత్ స్తంభాలు ఉండటంతో మరోవైపు ఉన్న తన వ్యవసాయ భూమిలోని ఫెన్సింగ్ తొలగించాలని కాంట్రాక్టర్ ఒత్తిడి తెస్తున్నాడని రైతు చిన్న మల్లేష్ ఆరోపించారు. భూమి యజమానుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

**మసి పూసి మాయ చేస్తున్న కాంట్రాక్టర్..**

పూర్తిగా శిథిలమైన కల్వర్టును తొలగించి కొత్తగా నిర్మించాల్సిన చోట పైపైన రోడ్డు వేసి అసలు సమస్యను కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.నాసిరకం పనులతో ప్రజాధనాన్ని వృథా చేయడమే కాకుండా, భవిష్యత్తులో భారీ ప్రమాదాలకు బీజం వేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పనుల నాణ్యతపై ఎలాంటి బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల మౌనంపై మండిపడుతున్న ప్రజలు..**

లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న ఈ రహదారి నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.నాసిరకం పనులు బహిరంగంగా కనిపిస్తున్నా పట్టించుకోకుండా మౌనంగా ఉండడం అనుమానాలకు తావిస్తోందని విమర్శిస్తున్నారు.ప్రజాధనం ఖర్చవుతున్నా పనుల్లో నాణ్యత, భద్రత, నిబంధనల అమలుపై అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తక్షణమే చర్యలు తీసుకోవాలి...**

శిథిలమైన కల్వర్టును వెంటనే తొలగించి కొత్తగా నిర్మించాలని, పూడ్చివేసిన మత్తడి కాలువలను పునరుద్ధరించి రైతులకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. రహదారి నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసి ప్రజల ప్రాణాలకు ముప్పు లేకుండా చూడాలని కోరుతున్నారు. కాంట్రాక్టర్ పనితీరుపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, స్థానిక మంత్రి,ఎంపీ, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పనులను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.కాగా,ఈ నిర్మాణ పనులపై వివరణ కోసం మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో చరవాణిలో సంప్రదించినప్పటికీ స్పందించలేదు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం:

**మల్లాపూర్ యు.పి.హెచ్.సి.ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి డా. కె.ఆనంద్**

**డిఎంహెచ్ఓ**



**సికింద్రాబాద్ సిటీ,జూలై20 (సూర్యరేఖ)**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా.కె.ఆనంద్ సోమవారం మల్లాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న పలు రకాల ప్రభుత్వ వైద్య సేవలు,జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి సమీక్షించారు. ఈ తనిఖీలో భాగంగా డిఎంహెచ్ఓ డా. కె.ఆనంద్ మాతా శిశు ఆరోగ్య కిట్ల పంపిణీ తీరును పరిశీలించి,అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి ఎలాంటి ఆలస్యం లేకుండా సకాలంలో కిట్లు అందేలా పక్కా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి స్పష్టం చేశారు.

**క్షయ రహిత సమాజం..డిబిటి చెల్లింపులు:**

టిబి నియంత్రణ కార్యక్రమంపై సమీక్షిస్తూ,నమోదైన బాధితులకు 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్' ద్వారా అందే ఆర్థిక సాయం ఆన్‌లైన్ ప్రక్రియలను తనిఖీ చేశారు. రోగుల వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేసి,ఆర్థిక లబ్ధి త్వరితగతిన అందేలా చూడాలని ఆదేశించారు.

**ఎన్డీసీ స్క్రీనింగ్ లక్ష్యాల పెంపు:**

అసంటు వ్యాధుల కార్యక్రమం నిర్వహణ తీరుపై ఆరా తీస్తూ,పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు.క్షేత్రస్థాయిలో స్క్రీనింగ్ లక్ష్యాలను పెంచి,కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు.

**వ్యాక్సిన్ కోల్డ్ చైన్ నిర్వహణ:**

ఆరోగ్య కేంద్రంలోని ఐస్ లైన్డ్ రెఫ్రిజిరేటర్ ను తనిఖీ చేసి వ్యాక్సిన్ల నిల్వ,ఉష్ణోగ్రతల నమోదు మరియు రికార్డులను పరిశీలించారు.వ్యాక్సిన్ల భద్రత, కోల్డ్ చైన్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదని హెచ్చరించారు.ప్రభుత్వ వైద్య సేవల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా,నాణ్యమైన వైద్యాన్ని అందించడానికి ప్రతి ఒక్క సిబ్బంది బాధ్యతాయుతంగా,అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా డా.కె.ఆనంద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్సీ వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది ,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువతకు స్ఫూర్తి చత్రపతి శివాజీ మహారాజ్:

**కోనాయిపల్లి గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి**





**మేడ్చల్,జూలై 20(సూర్యరేఖ)**ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని కోనాయిపల్లి గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.స్థానిక కౌన్సిలర్ సద్ది నిషితారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ... "చత్రపతి శివాజీ మహారాజ్ భారతదేశ చరిత్రలో ధైర్యసాహసాలకు, స్వాభిమానానికి,పరిపాలనా దక్షతకు ప్రతీక.దేశభక్తి,నాయకత్వ లక్షణాలు,ప్రజల సంక్షేమం పట్ల ఆయన చూపిన అంకితభావం నేటి యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయి.యువత శివాజీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి" అని అన్నారు.అలాగే సమాజంలో ఐక్యత, సేవాభావం,న్యాయం కోసం శివాజీ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.మహనీయుల ఆశయాలను భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఇటువంటి విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే తెలిపారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు ,గ్రామ ప్రజలు,యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో కల్తీ కల్లు విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి..

**ఆల్ ఇండియా ఫారెన్ బ్లాక్ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు బండి నరసింహా**





**రాజేంద్రనగర్,జులై20( సూర్యరేఖ):** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో కల్తీ కల్లు విక్రయాలు జరుగుతున్నాయని,వాటి కారణంగా ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆల్ ఇండియా ఫారెన్ బ్లాక్ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు బండి నరసింహా అన్నారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ..రాజేంద్రనగర్ కమాన్ సమీపంలోని బార్ పక్కన,ఆంధ్రా బ్యాంక్ ఎదురుగా ఉన్న కల్లు కాంపౌండ్‌లో కల్తీ కల్లు తయారీ,విక్రయాలు జరుగుతున్నాయని చెబుతున్నారన్నారు.ఈ కల్తీ మద్యం సేవించడం వల్ల గత రెండు నెలల్లో పలువురు మృతి చెందినట్లు,తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అలాగే సంబంధిత శాఖ అధికారులు ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7గంటల మధ్య అక్కడికి వచ్చి అక్రమ వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయన్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం వెంటనే స్వతంత్ర విచారణ జరిపించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నట్లు తెలిపారు.ఎక్సైజ్ శాఖ,ఫుడ్ సేఫ్టీ శాఖ,పోలీసు శాఖ,జిల్లా యంత్రాంగం సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి,కల్లు నమూనాలను ప్రయోగశాలకు పంపించి పరీక్షలు నిర్వహించాలన్నారు. కల్తీ జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ అంశంపై జిల్లా కలెక్టర్,ఎక్సైజ్ కమిషనర్,పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి,ప్రజలకు న్యాయం చేయాలని రంగారెడ్డి జిల్లా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సీనియర్ నాయకులు బండి నరసింహా కోరారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713